

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

- మరోసారి పోటీ చేయనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ
- ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయుల సంఘం మద్దతు
- పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ మద్దతుతో శ్రీనివాసులునాయుడు పోటీ
- ఎమ్మెల్సీ ఎన్నికల్లో మద్దతుపై అధికారికంగా తేల్చని కూటమి

- 8లో

పరవాడ ఎంపీడీవో తీరుపై కలెక్టర్ అసహనం

విచారణకు ఆదేశం

- రక్త నమూనాలు సేకరించిన వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది
- మరోవైపు బ్రీత్ ఎనలైజర్‌తో పరీక్షలు నిర్వహించిన సీఐ
- కార్యాలయ సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్న జడ్పీ డిప్యూటీ సీఈవో

పరవాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఒక ఎంపీడీవో తీరుపై అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్‌కు అనుమానం వచ్చింది. తాను అడుగుతున్న ప్రశ్నలకు ఎంపీడీవో పొంతనలేని సమాధానాలు చెబుతుండడం, వారిస్తున్నా వినకపోవ డంతో తక్షణం విచారణ చేపట్టాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారు. బుధవారం మధ్యాహ్నం మూడు గంటలకు జిల్లా కలెక్టర్ ఎంపీడీవోలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా పరవాడ ఎంపీడీవో శ్యామ్‌సుందర్ పొంతన లేని సమాధానాలు చెప్పడంతో కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. తెలుగులో సమాధానం చెప్పాలని కలెక్టర్ చెబుతున్నప్పటికీ ఎంపీడీవో తన పంథాను మార్చుకోకుండా ఇంగ్లీషులో మాట్లాడుతుండడంతో అనుమానం వచ్చి విచారణకు ఆదేశించారు. దీంతో జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రాజ్‌కుమార్, స్పెషల్ ఆఫీసర్ శ్రీనివాస్‌లు సాయంత్రం ఆరు గంటలకు పరవాడ ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో ప్రవర్తన గురించి అక్కడ అధికారులతో పాటు సిబ్బంది నుంచి వాంగ్మూలాలు తీసుకున్నారు. ఎంపీడీవోగా శ్యామ్‌సుందర్ బాధ్యతలు స్వీకరించి నాలుగు నెలలు ... మిగతా 8వ పేజీలో



పరవాడ ఎంపీడీవో ఎస్‌డీ శ్యామ్‌సుందర్

నౌకపై నారసింహుడు

- వైభవంగా సింహచలేశుడి తెప్పోత్సవం
- పుష్కరిణిలో విహరించిన స్వామి
- వేలాదిగా తరలివచ్చిన భక్తులు





సింహాచలేశుడు వరాహ పుష్కరిణిలో నౌకలో విహరించాడు. ఏటా పుష్య బహుళ అమావాస్య రోజున జరిగే తెప్పోత్సవాన్ని బుధవారం సాయంత్రం నిర్వహించారు. ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని శ్రీకృష్ణుడిగా అలంకరించి, ఉభయ దేవేరులతో పల్లకిలో ఉంచి మెట్లమార్గంలో కొండ దిగువకు తీసుకువచ్చారు. హంసాకృతిలోని నౌకపై అధిష్ఠింపజేసి, ముమ్మారు ప్రదక్షిణలు చేసి, పుష్కరిణి మధ్యన ఉన్న మండపంలోకి చేర్చారు. ప్రత్యేక పూజల అనంతరం సింహాచలం మాడ వీధుల్లో స్వామికి తిరువీధి నిర్వహించారు. - 8లో

ఇళ్ల కాలనీల్లో దొంగలు!

పెద్ద మొత్తంలో ఇనుము, సిమెంట్, ఇసుక అపహరణ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో జగనన్న కాలనీల్లో (కూటమి ప్రభుత్వం వీటిని పీఎంఏవై-ఎన్టీఆర్ నగర్‌లుగా పేరు మార్చింది) ఇళ్ల నిర్మాణానికి తీసుకొచ్చిన సామగ్రికి రక్షణ కొరవడింది. కోట్లాది రూపాయల విలువ చేసే ఇనుము, సిమెంట్‌కు లెక్కలు లేకుండా పోయాయి. గత సాధారణ ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణ పనులు నిలిపివేయడంతో.. అప్పటి నుంచి భవన నిర్మాణ సామగ్రి అపహరణకు గురవుతున్నది.

- కొంతమంది వైసీపీ నేతలు తరలించుకుపోయినట్టు స్థానికులు ఆరోపణ
- జిల్లా కలెక్టర్‌కు, పోలీసులకు ఫిర్యాదు
- ఇటీవల విశాఖ వచ్చిన మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లిన గ్రామస్థులు
- విచారణ జరిపించి చర్యలు చేపట్టాలని వినతి


గత వైసీపీ ప్రభుత్వ హయాంలో వీఎంఆర్‌డీఏ ఆధ్వర్యంలో అనకాపల్లి మండలంలో సంపతిపురం నుంచి ఆర్.బయ్యవరం వరకు జగనన్న కాలనీల్లో సమారు 350 గృహాలను పేదలకు మంజూరు చేశారు. అన్ని ఇళ్ల నిర్మాణాలను అప్పట్లోనే ప్రారంభించారు. గత ఏడాది సాధారణ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేనాటికి పలు ఇళ్లు శ్లాబ్ దశకు చేరుకున్నాయి. ఎన్నికల ముందు ఇళ్ల నిర్మాణ పనులు ఆపేశారు. అధికారులు ఎన్నికల హడావిడిలో వుండడంతో ఇదే అదనుగా భావించిన కొంతమంది వైసీపీ నాయకులు ఇళ్ల కాలనీల్లో ఇనుము, సిమెంట్, ఇసుకను మాయం చేసినట్టు ఆరోపణలు వచ్చాయి.



ఇళ్ల కాలనీల్లో చోరీ చేసి, రొంగలివానిపాలెంలో నిల్వ చేసిన ఇనుము

కుంచంగి రెవెన్యూ పరిధి రొంగలివానిపాలెం పంచాయతీలోని వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లో ఇళ్ల నిర్మాణానికి గృహ నిర్మాణ సంస్థ అధికారులు ఎన్నికల సమయంలో సుమారు 100 టన్నుల ... మిగతా 8వ పేజీలో

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా



షెడ్యూల్ విడుదల

- వచ్చే నెల మూడో తేదీన నోటిఫికేషన్
- పదో తేదీ వరకూ నామినేషన్ల స్వీకరణ
- 27న పోలింగ్
- మార్చి 3న ఓట్ల లెక్కింపు
- ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో సుమారు 23 వేల మంది ఓటర్లు
- అమలులోకి ఎన్నికల కోడ్
- శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలకు బ్రేక్

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక నిర్వహణకు ఎన్నికల సంఘం బుధవారం షెడ్యూల్ విడుదల చేసింది. ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న పాకలపాటి రఘువర్మ పదవీకాలం మార్చి 29తో ముగియనున్నది. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి మూడో తేదీన నోటిఫికేషన్ జారీ కానున్నది. పదో తేదీ వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. ఆ మరుసటి రోజున నామినేషన్లు పరిశీలిస్తారు. నామినేషన్ల ఉపసంహరణకు 13వ తేదీ తుదిగడువు. వచ్చే నెల 27వ తేదీ ఉదయం ఎనిమిది నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ నిర్వహిస్తారు. మార్చి మూడో తేదీన ఓట్ల లెక్కింపు జరగనున్నది. ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, విశాఖపట్నం, అనకాపల్లి జిల్లాల పరిధిలో స్కూలు అసిస్టెంట్లు, అంతకంటే పైకేడర్ అంటే హెచ్‌ఎంలు, జూనియర్, సీనియర్ లెక్చరర్లు, వర్సిటీ అధ్యాపకులు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల్లో సెకండరీ విద్య బోధన చేసే టీచర్లు ఓటర్లుగా ఉంటారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఓటు నమోదుకు గత ఏడాది సెప్టెంబరు 30 నుంచి అవకాశం ఇచ్చారు. నవంబరు 23న ముసాయిదా, డిసెంబరు 30న తుది ఓటర్ల జాబితా విడుదల చేశారు. తుది జాబితాలో 21,555 మంది ఓటర్లు ఉన్నారు. వీరిలో 12,948 మంది పురుషులు, 8,607 మంది మహిళలు. శ్రీకాకుళం జిల్లాలో 4,829 మంది, విజయనగరం జిల్లాలో 4,937, పార్వతీపురం మన్యంలో 2,262, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,448, విశాఖపట్నం జిల్లాలో 5,277, అనకాపల్లి జిల్లాలో 2,802 మంది ఓటర్లు ఉన్నారు. ఆ తరువాత కూడా ఓటు నమోదుకు అవకాశం ఇవ్వడంతో మరో 1,000 మంది వరకు పెరిగారు. ఉత్తరాంధ్ర టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ ఎన్నికల అధికారిగా, విశాఖ జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీశంకర్ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారిగా వ్యవహరించనున్నారు.

అమల్లోకి ఎన్నికల కోడ్

ఎమ్మెల్సీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో బుధవారం నుంచి ఉత్తరాంధ్రలోని ఆరు జిల్లాల్లో కోడ్ అమలులోకి వచ్చింది. మార్చి ఎనిమిదో తేదీ వరకు ఎన్నికల కోడ్ అమలులో ఉంటుంది. బుధవారం నుంచి మార్చి ఎనిమిదో తేదీ వరకూ అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించకూడదు. ఈ ప్రభావం గురువారం కేంద్ర ఉక్కు శాఖా మంత్రి కుమారస్వామి ఉంటుంది. ఇటీవల కేంద్రం ప్రకటించిన రూ.11,444 కోట్ల ప్యాకేజీపై కర్మాగారం అధికారులు, ఉద్యోగుల సమక్షంలో ఉక్కు మంత్రి ... మిగతా 8వ పేజీలో

దశ దిశలా ఏటికొప్పాక ఖ్యాతి



హస్తకళలకు దేశ వ్యాప్తంగా గుర్తింపు

- ఒకరికి రాష్ట్రపతి అవార్డు, మరొకరికి పద్మశ్రీ పురస్కారం
- రిపబ్లిక్ డే పరేడ్‌లో ఏటికొప్పాక బొమ్మలతో ఏపీ శకటం ప్రదర్శన
- తాజాగా మూడో ఉత్తమ శకటం బహుమతికి ఎంపిక
- కళా నిలయంలో ఆనందోత్సాహాలు



బొమ్మల తయారీలో నిమగ్నమైన ఏటికొప్పాక కళాకారులు



పూర్వ రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న చిన్నయాచారి (ఫైల్ ఫొటో)



గత ఏడాది పద్మశ్రీ పురస్కారానికి ఎంపికైన చింతలపాటి వెంకటపతి రాజు(ఫైల్ ఫొటో)

ఎలమంచిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అంకుడు కర్రతో సహజసిద్ధ రంగుల మేళవింపుతో తయారు చేసే ఏటికొప్పాక హస్తకళాఖండాలు ఖండాంతర ఖ్యాతిని ఆర్జిస్తున్నాయి. స్థానిక కళాకారులు ఇప్పటికే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పలు అవార్డులు, పురస్కారాలు, ప్రభుత్వాల ప్రశంసలు అందుకున్నారు. గత ఆదివారం ఢిల్లీలో నిర్వహించిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఏపీ తరపున ప్రదర్శించిన ఏటికొప్పాక బొమ్మలతో రూపొందించిన శకటం అందరినీ ఆకట్టుకుంది. తాజాగా ప్రకటించిన ఉత్తమ శకటం జాబితాలో మూడో స్థానంలో నిలిచింది. దీంతో ఏటికొప్పాక హస్తకళలు ఒక్కసారిగా యావత్ దేశం దృష్టిని ఆకర్షించాయి.

ఏటికొప్పాక హస్తకళలకు సుమారు 150 సంవత్సరాల చరిత్ర వుంది. సమీపంలోని అడవుల్లో ... మిగతా 8వ పేజీలో

ఏలేరు కాలువలోకి దూసుకెళ్లిన వ్యాన్

- ఇటుక బట్టీల వ్యాపారి మృతి

కొత్తూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఏలేరు కాలువలో బొలేరో వాహనం బోల్తా పడిన ప్రమాదంలో ఒక వ్యక్తి మృతి చెందాడు. అనకాపల్లి మండలంలో ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొజ్జన్నకొండ సమీపంలో బుధవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి అనకాపల్లి రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ తెలిపిన వివరాలిలా వున్నాయి. అనకాపల్లి మండలం తుమ్మపాల గ్రామానికి చెందిన తామర్ల నాగరాజు (52) ఇటుక బట్టీలు నిర్వహిస్తుంటాడు. ఇతనికి సొంతంగా బొలేరో వాహనం వుంది. బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో శంకరం గ్రామం నుంచి ఏలేరు కాలువ గట్టు రోడ్డు మీదుగా తుమ్మపాల వస్తున్నాడు. బొజ్జన్న కొండ సమీపంలో బొలేరో వాహనం అదుపు తప్పి కాలువలోకి దూసుకెళ్లింది. ఇక్కడ పది అడుగుల లోతున నీరు వుండడంతో వాహనం పూర్తిగా మునిపోయింది. వాహనంలో ఇరుక్కుపోయి బయటకు రాలేకపోయాడు. ప్రమాదం విషయాన్ని గమనించిన స్థానికులు వ్యాన్ నుంచి నాగరాజును బయటకు తీశారు. కానీ అప్పటికే మృతి చెందాడు. అనంతరం క్రేన్ సహాయంతో బొలేరో వ్యాన్‌ను బయటకు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ చెప్పారు.





కాలువలో నుంచి బయటకు తీసిన వ్యాన్. (ఇన్‌సెట్‌లో) మృతిచెందిన నాగరాజు

కట్నం వేధింపులకు మహిళ బలి

- ఫ్యాన్‌కు ఉరివేసుకుని బలవన్మరణం
- భర్త, అత్త, మామ, ఆడపడుచులే కారకులని తల్లి ఫిర్యాదు



సుమ (ఫైల్ ఫొటో)

- 8లో

కట్టుకున్న భార్యను కడతేర్చాడు

- మెడకు నైలాన్ తాడు బిగించి హత్య

- 8లో

సాదాసీదాగా.. మునగపాక మండల సమావేశం

- ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ నేపథ్యంలో అభివృద్ధిపై సాగని చర్చ
- కలెక్టర్ అనుమతి మేరకు అత్యవసర పనులు : జడ్పీ సీఈవో



మండల సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ సీఈవో నారాయణమూర్తి

మునగపాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో అత్యవసరమైతే తప్ప ఎటువంటి కొత్త పనులు చేపట్టరాదని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి పి.నారాయణమూర్తి స్పష్టం చేశారు. ఇక్కడి మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ మళ్ల జయమ్మ అధ్యక్షతన ఏర్పాటైన మునగపాక మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. వేసవి సమీపిస్తున్నందున తాగునీటి సమస్య ఎదురయ్యే పరిస్థితులు ఉన్న నేపథ్యంలో అత్యవసర పనుల కింద జిల్లా కలెక్టర్ ద్వారా అనుమతులు పొంది ఆయా పనులు చేపట్టేందుకు వెసులుబాటు ఉంటుందన్నారు. వాడ్రాపల్లి సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు మాట్లాడుతూ జగనన్న కాలనీలో వేసిన రోడ్లకు ఇంత వరకు బిల్లులు మంజూరు కాలేదని, అవినీతి, అక్రమాలు జరిగాయని గతంలో చేసిన ఫిర్యాదులకు పూర్తిస్థాయి పరిష్కారం నేటికీ లభించలేదని వాపోయారు. మరికొంతమంది సభ్యులు ఆయా గ్రామాల్లో సమస్యలను విన్నవించారు. ఎన్నికల కోడ్ ఉన్నందున ఎటువంటి సమాధానం చెప్పలేమని అధికారులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎంపీడీవో ఎం.ఉషారాణి, తహసీల్దార్ ఆది ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘బ్రాండిక్స్‌లో పనివేళల పెంపు తగదు’



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు రాము

అచ్యుతాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : బ్రాండిక్స్ కర్మాగారం ఉద్యోగులకు ఫిబ్రవరి ఒకటి నుంచి అరగంట అదనంగా పనిచేయాలని ఒత్తిడి తెస్తోందని, ఇది నిబంధనలకు విరుద్ధమని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు రొంగలి రాము అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ చట్ట ప్రకారం రోజుకి ఎనిమిది గంటలు మాత్రమే పనిచేయాల్సి ఉందన్నారు. ఈ కర్మాగారంలో పనిచేస్తున్న మహిళలు సుదూర ప్రాంతాల నుంచి బస్సులపై వచ్చి విధులు నిర్వహిస్తున్నారన్నారు. ఉదయం ఆరు గంటలకు విధులకు హాజరవాలంటే రాత్రి రెండుగంటలకు బస్సు ఎక్కితే తప్ప సకాలంలో విధులకు అందడం కష్టంగా ఉందన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో మరో అరగంట అదనంగా పనిచేయాలంటే వారి అవస్థలు ఏమిటో యాజమాన్యం అర్థం చేసుకోవాలని కోరారు. ఇది వారికి అదనపు భారమే అవుతుందన్నారు. ఈ నిర్ణయాన్ని విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు కె.సోమునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఊరంతా ఒక్క‘సారె’ కదిలారు

- మునగపాకలో గౌరమ్మకు సారె సమర్పణ
- ఒకటో తేదీన జరనున్న ఉత్సవానికి సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు



గ్రామంలోని మహిళలు వివిధ రకాల పిండివంటలను ఊరేగింపుగా తీసుకువెళుతున్న దృశ్యం

మునగపాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం మునగపాకలో వచ్చే నెల ఒకటో తేదీ శనివారం గౌరీపరమేశ్వరుల ఉత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించి నిర్వాహకులు భారీ ఏర్పాట్లు చేపడుతున్నారు. వివిధ గ్రామాల నుంచి పెద్దసంఖ్యలో భక్తులు తరలి రానున్న నేపథ్యంలో వారికి ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు ప్రారంభించారు. ఇందులో భాగంగా గౌరీ పరమేశ్వరుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం అమ్మవారికి సారెను సమర్పించారు. మహిళలు ఇళ్లలో తయారు చేసిన లడ్డూలు, సున్నుండలు, కాజాలు, అరిసెలు, పంచదార చిలుకలు, చలిమిడి తదితరాలతో పాటు కొబ్బరికాయలు, అరటిపండ్లు, పసుపు కుంకుమలను పళ్లేల్లో పేర్చి గ్రామంలోని ఆటో స్టాండ్ నుంచి భారీ ఊరేగింపుగా ఆలయానికి తీసుకు వచ్చారు. అక్కడ అమ్మవారికి సమర్పించిన అనంతరం ప్రసాదంగా అందరికీ పంచిపెట్టారు. కమిటీ ప్రతినిధులు పెంటకోట ఆదినారాయణ, పొలిమేర కృష్ణ, ఆడారి అప్పలనాయుడు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. ఇదిలావుంటే, ఎస్ఐ పి.ప్రసాదరావును కమిటీ సభ్యులు కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ ఆచార, సాంప్రదాయాలకు అనుగుణంగా వేడుకను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని సూచించారు. నిబంధనలను ఎట్టిపరిస్థితుల్లో అధిగమించరాదని స్పష్టం చేశారు.



ఎస్ఐకి ఆహ్వానం అందిస్తున్న నిర్వాహకులు

యాజమాన్య పద్ధతులు పాటిస్తే అపరాల సాగులో లాభాలు

- వ్యవసాయాధికారి మోహన్‌రావు



బయ్యవరంలో రైతులకు సూచనలు ఇస్తున్న ఏవో మోహన్‌రావు

ఎలమంచిలి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఏటికొప్పాక, బయ్యవరం గ్రామాల్లో బుధవారం వ్యవసాయాధికారులు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మండల వ్యవసాయాధికారి మోహన్‌రావు రైతులకు పలు సూచనలు చేశారు. ప్రస్తుతం అపరాలు, నువ్వు పంటల సాగులో యాజమాన్య పద్ధలు పాటిస్తే మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. అనంతరం రైతుల సందేహాలన నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది రీనా, సుగంధి, రైతులు అప్పారావు, అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ గోవింద్

మునగపాక, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి నందీశ్వర ప్రాంగణంలోని తులసీ కళావేదిక వద్ద బుధవారం జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు ప్రారంభమయ్యాయి. తొలుత ఎలమంచిలి ఎంపీపీ బోదపు గోవింద పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో రాణించే వారి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందన్నారు. వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ మిత్రమండలి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా తలపడుతున్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బీశెట్టి గంగఅప్పలనాయుడు, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, ఆడారి కాశిబాబు, నరాలశెట్టి సూర్యనారాయణ, కాండ్రేగుల జగన్ తదితరులు పాల్గొన్నారు.

చినకలవలాపల్లిలో అటవీ భూములు జాయింట్ సర్వే

- రెవెన్యూ, అటవీ అధికారులు హాజరు



సర్వే సమాచారాన్ని గ్రామస్థులకు తెలుపుతున్న డీటీ

రాంబిల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చినకలవలాపల్లి గ్రామంలో గల అటవీ భూములను అనకాపల్లి ఆర్డీవో షేక్ ఆయేషా సమక్షంలో రెవెన్యూ, అటవీ అధికారులు బుధవారం జాయింట్ సర్వే నిర్వహించారు. గ్రామంలో వన సంరక్షణ సమితికి చెందిన 29 మంది రైతులు డీఆర్‌డీవో అధికారులు గ్రామ సమీపంలో ఉన్న కొండ వద్ద ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టడం వల్ల అన్నివిధాలా నష్టపోతున్నామని, ఈ కొండ వద్ద ఐదుగురు రైతులకు డి.పట్టాలు ఇచ్చారని వారివద్ద ఉన్న ఆధారాలతో 2023లో కోర్టును ఆశ్రయించారని రాంబిల్లి డిప్యూటీ తహసీల్దార్ వెంకట్ తెలిపారు. జనవరి 22న హైకోర్టు ఇచ్చిన ఆర్డర్ మేరకు అనకాపల్లి ఆర్డీవో సమక్షంలో రెవెన్యూ, ఫారెస్టు, డీఆర్‌డీవో అధికారులు జాయింట్ సర్వే నిర్వహించినట్టు చెప్పారు. ఈ సర్వే నివేదికను హైకోర్టుకు నివేదించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీవాసరావు, అటవీ అధికారులు, రాంబిల్లి సీఐ నర్సింగరావు, సర్పంచ్ శ్రీనివాసరావు, సీపీఎం మండల కార్యదర్శి జి.దేముడునాయుడులతో పాటు పెద్ద సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

అభయాంజనేయ తీర్థం పోస్టర్ ఆవిష్కరణ



తీర్థం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రగడ నాగేశ్వరరావు తదితరులు

అచ్యుతాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మోసయ్యపేటలో వచ్చే నెల నాలుగో తేదీన అభయాంజనేయ స్వామి తీర్థం జరగనుంది. ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్‌రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు బుధవారం ఇక్కడ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తులకు ఎటువంటి అసౌకర్యం తలెత్తకుండా ఏర్పాట్లు చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పంచదార్ల ఫైడికొండ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ పరిధిలో కల్లుగీత కార్మికులకు రెండు మద్యం షాపులు మంజూరు

అచ్యుతాపురం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎలమంచిలి నియోజకవర్గం పరిధిలో కల్లు గీత కార్మికులకు రెండు మద్యం షాపులు కేటాయించారని ఎలమంచిలి ఎక్సైజ్ సీఐ తేజో వెంకట కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలో పదిహేను షాపులకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసిందన్నారు. ఇందులో ఎలమంచిలి రూరల్‌తో పాటు రాంబిల్లి మండలానికి ఒకటి చొప్పున మంజూరయ్యాయన్నారు. ఎలమంచిలి రూరల్‌లో గౌడసట్ కులం వారికి కేటాయించగా, రాంబిల్లి షాపును శెట్టి బలిజ కులానికి కేటాయించిందన్నారు. రెండు లక్షలు (నాన్ రిఫండ్‌బుల్) ధరావస్తు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి ఐదున ఆన్‌లైన్‌లో లేదా, ఎక్సైజ్ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఫిబ్రవరి ఆరున పరిశీలన, ఏడున అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద డ్రా తీస్తారని తెలిపారు. ఆసక్తిగల వారు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. కాగా ఎలమంచిలి ఎక్సైజ్ కార్యాలయం పరిధిలోగల రాంబిల్లి, అచ్యుతాపురం, ఎలమంచిలిలలో మాదకద్రవ్యాలు ఉంటే వెంటనే తమకు సమాచారం తెలియజేయాలన్నారు. గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించినా, గంజాయి, నాటు సారా వంటివి విక్రయించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. వీటికి సంబంధించిన సమాచారం అందించాల్సిందిగా కోరారు.

సముద్ర తీరంలో భక్తుల స్నానాలు



పెంటకోట సముద్ర తీర రేవులో స్నానాలు చేస్తున్న భక్తులు

పాయకరావుపేట రూరల్, జనవిరి 29 (ఆంధ్రజ్యోతి): చొల్లంగి అమావాస్య సందర్భంగా బుధవారం మండలంలోని పెంటకోట, రాజవరం, పాల్మన్‌పేట, రత్నయ్యమ్మపేట వెంకటనగరం సముద్ర తీర రేవులలో భక్తులు పవిత్ర స్నానాలు ఆచరించారు. తుని, కోటనందూరు, పాయకరావుపేట మండలాలోని వివిధ గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలి వచ్చారు. పుష్య మాసంలో వచ్చే ఈ అమావాస్యను మౌని అమావాస్యగా జరుపుకుంటారు. ఈ రోజు సముద్రంలో స్నానాలు ఆచరిస్తే మంచిదని బావిస్తారు. అవాంచనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు, మెరైన్ పోలీసులు చర్యలు తీసుకున్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబాలకు సరకులు అందిస్తున్న జన సైనికులు

నక్కపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని న్యాయంపూడి ఎస్సీ కాలనీలో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంలో గోరింట నూకాలమ్మ ఇల్లు దగ్ధమైంది. ఏ ఆధారం లేని ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి జనసైనికులు ముందుకొచ్చారు. బుధవారం రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివదత్ 50 కిలోల బియ్యాన్ని, వంట పాత్రలను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు, జనసేన నాయకులు పాము గణేశ్, కురందాసు అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు, మేరుగు మహేశ్, బంగారి రాజు, గోవింద్, ఖురాన్ దాస్, బుజ్జి, సాయి పాల్గొన్నారు.

బీజేపీలో చేరికలు



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న బీజేపీ నాయకులు

నక్కపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చినతీనార్ల గ్రామానికి చెందిన ఒరుపుల తలుపులు, ప్రసాద్ తదితరులు బుధవారం బీజేపీలో చేరారు. అనకాపల్లి జిల్లా పార్టీ అధ్యక్షుడు పరమేశ్వరరావు సమక్షంలో పార్టీలో చేరారు. నక్కపల్లికి చెందిన బీజేపీ నాయకులు పోలినాటి నానాజీ, ఈగల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో వీరు పార్టీ కండువాలు కప్పుకున్నారు. ఈ సందర్భంగా పోలినాటి నానాజీ, ఈగల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లాలో అనేక పార్టీల నుంచి నాయకులు, కార్యకర్తలు తమ పార్టీలో చేరేందుకు ఉత్సాహంగా వున్నారని చెప్పారు.

చెట్లకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదు?

- తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వాసితుల ఆందోళన



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నినాదాలు చేస్తున్న నిర్వాసిత రైతులు

నక్కపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విశాఖ-చెన్నై ఇండస్ట్రియల్ కారిడార్‌లో భాగంగా భూములు సేకరించిన ఏపీఐఐసీ అధికారులు సాగు భూములు, డి.పట్టా భూముల్లో వున్న రైతుల చెట్లకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదని నిర్వాసిత రైతులు ప్రశ్నించారు. ఈ మేరకు బుధవారం నక్కపల్లి తహసీల్దార్ కార్యాలయం వద్ద రాజయ్యపేట, డీఎల్‌పురం, చందనాడ, బుచ్చిరాజుపేట, వేంపాడు గ్రామాలకు చెందిన నిర్వాసిత రైతులు, సాగుదారులు ధర్నా చేశారు. వారికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు సంఘీబావం ప్రకటించారు. కారిడార్ కోసం భూములు సేకరించిన ప్రభుత్వం జిరాయితీ భూముల్లో వున్న చెట్లకు సంబంధించిన పరిహారం రైతులకు అందజేశారని అప్పలరాజు చెప్పారు. కానీ డి.పట్టా, సాగు భూముల్లో గల తోటలకు, చెట్లకు నేటికీ పరిహారం ఇవ్వలేదని, దీని వల్ల దశాబ్దాల నుంచి ఈ భూములను సాగు చేసుకుంటున్న రైతులకు అన్యాయం జరుగుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. డి.పట్టా, సాగుభూముల్లో వున్న వారనందరి చెట్లకు పరిహారం ఇవ్వాలని, లేనిపక్షంలో చెట్లు తొలగించడం సరికాదని పేర్కొన్నారు. అనంతరం తహసీల్దార్ నరసింహమూర్తికి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు జీ కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, ఎం.రాజేశ్, డీఎల్‌పురం ఎంపీటీసీ మాజీ సభ్యుడు గింజాల వెంకటరమణ, నాయకులు ఎం.మహేశ్‌బాబు, బి.అప్పలరాజు పాల్గొన్నారు.

శతశాతం పింఛన్లు పంపిణీ చేయాలి

పంచాయతీ కార్యర్శులు, సచివాలయ ఉద్యోగులకు ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు ఆదేశాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో జయప్రకాశరావు

పాయకరావుపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నెలలో రెండో తేదీ ఆదివారం వచ్చినందున ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమం ఒకటో తేదీనే శతశాతం పూర్తయ్యేలా కృషిచేయాలని ఎంపీడీవో ఎ.జయప్రకాశరావు సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ హాలులో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం మండల గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఫిబ్రవరి నెలకు సంబంధించి మండలంలోని 24 పంచాయతీ గ్రామాల్లోని 25 గ్రామ సచివాలయాల పరిధిలో అన్ని రకాల పింఛన్లు కలిపి 12,805 మందికి రూ.5,34,28,000 పంపిణీ చేయాల్సి ఉందన్నారు. అయితే ఫిబ్రవరి 2వ తేదీ ఆదివారం సెలవు దినం వచ్చినందున, 1వ తేదీ శనివారం ఉదయాన్నే పింఛన్లు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఇళ్ల వద్ద పింఛనుదారులు అందుబాటులో ఉన్నవారందరికీ రాత్రిలోపు పింఛన్లు పంపిణీ పూర్తిచేసేలా కృషి చేయాలని చెప్పారు. ఇందుకు సంబంధించి ఒక రోజు ముందుగానే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మండల పరిషత్ కార్యాలయ ఏవో సీహెచ్ఆర్‌కే.వర్మ, అన్ని పంచాయతీల కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

జాతీయ పోటీలకు ఎంపికైన విద్యార్థినికి అభినందన



విద్యార్థిని అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధర్మవరం అగ్రహారం జడ్పీ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న ప్రగడ రిషిత రాష్ట్ర స్థాయి పారా వాలీబాల్ పోటీల్లో సత్తాచాటి జాతీయ స్థాయికి ఎంపికయ్యాడు. ఈ నేపథ్యంలో బుధవారం హెచ్ఎం శ్రీనివాసరావు, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని రిషితను, వ్యాయామ ఉపాధ్యాయిని దీపికను అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. పారా రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 28వ తేదీ తునిలో జరిగిన నాలుగో సిటింగ్ వాలీబాల్‌లో రిషిత రాష్ట్ర స్థాయిలో చక్కని ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. ఫిబ్రవరి జరిగే పోటీల్లో విద్యార్థిని రాష్ట్రం తరఫున ఆడనున్నట్టు వ్యాయామ ఉపాధ్యాయిని దీపిక తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విజయకుమారి, లలితాంబ, కుసుమకుమారి, అరుణ, విమలాదేవి, కృష్ణవేణి, శోభారాణి, అప్పలనాయుడు, ప్రకాశ్ పాల్గొన్నారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు నక్కపల్లి క్రీడాకారులు

నక్కపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నక్కపల్లికి చెందిన హాకీ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు బీఎస్ హాకీ క్లబ్ వ్యవస్థాపకులు బలిరెడ్డి సూరిబాబు, ఎస్‌జీఎఫ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ శ్రీలక్ష్మి, పీడీ తరుణ్‌కుమార్ తెలిపారు. బుధవారం విలేకరులతో వారు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి అండర్-19 హాకీ క్రీడా పోటీల్లో ఏపీ జట్టు తరఫున ప్రాతినిధ్యం వహించిన ఎం.మణికంఠ, కె.అనిల్ కుమార్, కె.సాయిరామ్, బాలికల విభాగంలో ఎం.పూర్ణిమ ఉత్తమ ప్రతిభ కనబర్చి జాతీయ పోటీలకు ఎంపికైనట్టు చెప్పారు. జార్ఖండ్ రాష్ట్రం రాంచీలో గురు, శుక్ర, శని, ఆది వారాల్లో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని చెప్పారు. క్రీడాకారులను హాకీ క్లబ్ అధ్యక్షుడు చిన్న అప్పారావు, కార్యదర్శి కె.తాతాజీ, కోచ్ రాంబాబు, జాతీయ సీనియర్ క్రీడాకారుడు రామచంద్రరావు, కె.నానాజీ, అభినందించారు.

నేడు మూడు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఎస్. రాయవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు సెక్షన్ ధర్మవరం సబ్‌స్టేషన్ పరిధి 11కేవీ ధర్మవరం ఆర్‌డబ్ల్యూఎస్, రూరల్ ఫీడర్‌లో ఉన్న ధర్మవరం, పెనుగొల్లు, సోముదేవుపల్లి గ్రామాల్లో గురువారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రాజశేఖర్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆర్‌డీఎస్ పనుల్లో భాగంగా ఉదయం తొమ్మిది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు చెప్పారు. ఈ విషయాన్ని వినియోగదారులంతా గమనించి తమ సిబ్బందికి సహకరించాలని ఈఈ కోరారు.

పిల్లల ఆరోగ్యానికి ప్రాధాన్యం

నక్కపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాలికలకు చదువుతో పాటు వారి ఆరోగ్యానికి కూడా అధిక ప్రాధాన్యత ఇవ్వాలని ఎంపీడీవో డి.సీతారామరాజు సూచించారు. బుధవారం మధ్యాహ్నం నక్కపల్లి కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. మెనూ ప్రకారం రుచిగా, శుచిగా భోజనం పెట్టాలని నిర్వాహకులను ఆదేశించారు. వంటగది, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. టెన్త్ బాలికల పఠనా సామర్థ్యం, టెన్త్ విద్యార్థుల యాక్షన్ ప్లాన్‌పై ఎంఈవో కె.నరేశ్, కేజీబీవీ ఎస్‌వో సలీమాతో ఎంపీడీవో చర్చించారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోండి

పాయకరావుపేట రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పశు ఆరోగ్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి ఆడారి సాయిశంకర్ సూచించారు. మండలంలోని పి.ఎల్.పురంలో బుధవారం పశు ఆరోగ్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 67 పశువులకు గర్భ కోశ పరీక్షలు, 34 పెయ్యలకు నట్టల నివారణ మందుల పంపిణీ చేసినట్టు డాక్టర్ సాయిశంకర్ తెలిపారు. ప్రభుత్వం పాడి రైతులకు పశుగ్రాసం సాగుకు రాయితీలు, ప్రోత్సాహకాలు అందిస్తున్నదని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. కార్యక్రమంలో వెటర్నరీ సహాయకులు సత్యవేణి, నాయుడు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



మాట్లాడుతున్న అగ్నిమాపక అధికారి రాంబాబు

ఎస్.రాయవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): దార్లపూడి జడ్పీహెచ్ పాఠశాలలో బుధవారం అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ ఎలమంచిలి అగ్నిమాపక అధికారి రాంబాబు ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వివిధ ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ప్రయోగాత్మకంగా చూపించారు. ఈ కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది కె.అప్పలనాయుడు, ఎస్.కోటేశ్వరరావు, బి.సతీష్‌కుమార్, హెచ్ఎం రమణశ్రీ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచ గ్రామాల భూ సమస్యపై ముఖ్యమంత్రి స్పందన హర్షణీయం

▸▸ ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ



చంద్రబాబుకు నియోజకవర్గ సమస్యలు వివరిస్తున్న బాబ్జీ, చిత్రంలో పీలా

సబ్బవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : సింహాచలం పంచ గ్రామాల భూ సమస్యపై ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సానుకూలంగా స్పందించడం, ఇరువర్గాలతో సమావేశం ఏర్పాటు చేసి శాశ్వత పరిష్కారం చూపించేందుకు కృషి చేయడం హర్షణీయమని టీడీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు, ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీ అన్నారు. బుధవారం ఆయన ఇక్కడి విలేకరులతో ఫోన్‌లో మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పంచ గ్రామాల ప్రజల నిరీక్షణకు తెరపడనుందని పేర్కొన్నారు. విజయవాడలో జరిగిన సీఎం సమీక్షా సమావేశానికి తాను హాజరై పెందుర్తి నియోజకవర్గం సమస్యలను వివరించినట్టు చెప్పారు. వేపగుంట నుంచి పినగాడి రహదారి మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని కోరగా, దీనిపై సానుకూలంగా స్పందించారన్నారు. ఆయన వెంట అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవిందసత్యనారాయణ ఉన్నారన్నారు.

అహంకారాన్ని వీడకుంటే అడ్రస్ గల్లంతే..

▸▸ వైసీపీ నాయకులకు మాజీ ఎమ్మెల్సీ 'బుద్ద' హితవు



అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పినా వైసీపీ నాయకులకు అహంకారం తగ్గలేదని, ఇప్పటికైనా వారి ధోరణి మార్చుకోకుంటే భవిష్యత్తులో అడ్రస్ గల్లంతు తథ్యమని మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగ జగదీశ్వరరావు స్పష్టం చేశారు. దావోస్ పెట్టుబడుల విషయంలో వైసీపీ నాయకులు చేస్తున్న వ్యాఖ్యలను బుధవారం ఆయన ఓ ప్రకటన ద్వారా ఖండించారు. రాష్ట్రాన్ని అగ్రపథంలో నిలబెట్టాలన్నదే చంద్రబాబు లక్ష్యంగా పేర్కొన్నారు. రాష్ట్రానికి పెట్టుబడులు తేవడంలో విజనరీ నాయకుడు, సీఎం చంద్రబాబునాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని వివరించారు. ఏపీకి పెట్టుబడులు ఆకర్షించేందుకు చంద్రబాబు చేస్తున్న కృషి అద్వితీయమని సాక్షాత్తు తెలంగాణ మంత్రి శ్రీధర్‌రెడ్డి వ్యాఖ్యానించడం ఇందుకు నిదర్శనమని పేర్కొన్నారు. గడచిన ఐదేళ్లలో జగన్ జమానాలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు సర్వనాశనం అయ్యాయని ఆరోపించారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసం చంద్రబాబు ప్రయత్నాలు చేస్తుంటే వైసీపీ హయాంలో కోడిగుడ్డు మంత్రిగా పేరు పొందిన గుడివాడ అమర్‌నాథ్ దావోస్ వెళ్లిన తండ్రీ కొడుకులు ఉట్టి చేతులతో తిరిగొచ్చారని వ్యాఖ్యలు చేయడం ఆయన అహంకారానికి నిదర్శనమని పేర్కొన్నారు. ఇప్పటికైనా వైసీపీ నాయకులు అహంకారపూరిత వ్యాఖ్యలు చేయకుండా చేతనైతే రాష్ట్రాభివృద్ధికి సహకరించాలని ఆయన హితవుపలికారు.

నేటి నుంచి దేవీపురంలో శ్యామా నవరాత్రి ఉత్సవాలు

సబ్బవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని దేవీ పురంలో గల సహస్రాక్షి రాజరాజేశ్వరీదేవీ పీఠంలో గురువారం నుంచి వచ్చే నెల ఆరో తేదీ వరకు శ్యామా నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు గురుపత్ని అన్నపూర్ణమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతి రోజూ అభిషేకాలు, శోడషోపచార పూజ, సామూహిక కుంకుమార్చనలతో పాటు రాజశ్యామల హోమం, శ్యామా యంత్ర పూజలు వంటివి ఉంటాయన్నారు. ఫిబ్రవరి మూడో తేదీ వసంత పంచమి రోజున అక్షరభ్యాసాలు, వాగ్దేవి హోమం, నాలుగో తేదీ రథసప్తమి రోజున భాస్కర ఆరాధన, ఆరో తేదీన సిరిజ్యోతి పూజ, సామూహిక శ్యామ సహస్రనామార్చన నిర్వహిస్తామని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొనాల్సిందిగా కోరారు.

సాంకేతిక పరిజ్ఞానంతో ఉజ్వల భవిష్యత్తు : సీఐ



వైజ్ఞానిక ప్రదర్శనను పరిశీలిస్తున్న సీఐ పిన్నింటి రమణ

సబ్బవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి సన్‌రిడ్జ్ ఇంగ్లీషు మీడియం స్కూల్‌లో బుధవారం వైజ్ఞానిక ప్రదర్శనను నిర్వహించారు. తొలుత ఈ ప్రదర్శనను సీఐ పిన్నింటి రమణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంకేతిక పరిజ్ఞానం పెంపొందించుకుంటే విద్యార్థులకు భవిష్యత్తు ఉజ్వలంగా ఉంటుందన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సత్తిరెడ్డి పాల్గొన్నారు.

'ఎంపీ సీఎం రమేష్‌పై వైసీపీవీ నిరాధార ఆరోపణలు'

కొత్తూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్‌పై నిరాధార ఆరోపణలు చేయడం వైసీపీకి తగదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు అన్నారు. బుధవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడారు. వైసీపీ నాయకులు కరణం ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్‌లు విలేకరుల సమావేశంలో ఎంపీ పేరు ప్రస్తావించి కొండలన్నింటినీ తవ్వేస్తున్నారని ఆరోపణలు చేయడం తగదన్నారు. ఈ ఆరోపణలపై ఎటువంటి ఆధారాలున్నా బయటపెట్టాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఏ విధంగా కొండలను పిండిచేశారనే విషయం ప్రజలందరికీ తెలుసునన్నారు. నిజాయతీగా ప్రజలకు సేవలందరిస్తున్న ఎంపీ సీఎం రమేష్‌పై ఆరోపణలు చేయడం అర్థరహితమని పేర్కొన్నారు. వెంటనే వైసీపీ నాయకులు ధర్మశ్రీ, గుడివాడ అమర్‌నాథ్‌లు సీఎం రమేష్‌కు క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

ఇరుకు రోడ్డుపై ఇక్కట్లు

▸▸ పైపులైన్ ఏర్పాటు పేరిట ఏడాది క్రితం దిబ్బవీధి రోడ్డును తవ్వేసిన జీవీఎంసీ ▸▸ పనులు పూర్తయినా చేపట్టని కాంక్రీట్ వర్క్

▸▸ రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న దిబ్బవీధి, జగన్నాథస్వామి ఆలయ ప్రాంతాల ప్రజలు



దిబ్బవీధిలో కాంక్రీట్ పనులకు నోచుకోని రహదారి



రామాలయ సమీపంలో రహదారి దుస్థితి



జగన్నాథస్వామి ఆలయం వద్ద...

అనకాపల్లి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పట్టణంలో అభివృద్ధి గురించి పట్టించుకునేవారు కరువయ్యారు. కనీసం ఉన్న సౌకర్యాలతో సర్దుకుపోదామనుకున్నా.. పలుచోట్ల జీవీఎంసీ అధికారులు చేపట్టిన చిన్నచిన్న పనులు ఆయా ప్రాంతాల వారికి కొత్త సమస్యలను సృషించాయి. ఇందుకు ఉదాహరణగా దిబ్బవీధినే చెప్పవచ్చు. అసలే ఇక్కడ చిన్నపాటి రోడ్డు. ఏడాది క్రితం పైపులైన్ నిర్మాణం కోసం రోడ్డును ఒకపక్క తవ్వేశారు. పైపులైన్ నిర్మాణం పూర్తయినా తవ్వేసిన రహదారిపై కాంక్రీట్ పనులు చేపట్టలేదు. దీంతో అక్కడివారంతా రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మార్గంలో ఒక కారు వస్తే కనీసం ద్విచక్ర వాహనం కూడా వెళ్లడానికి అవకాశం లేనివిధంగా తవ్వేసి ఉండడంతో నివాసితులు నిత్యం నరకమే చూస్తున్నారు.

ఇక్కడి సంతోషిమాత ఆలయం రహదారి, దిబ్బవీధి, జగన్నాథస్వామి ఆలయం ప్రాంతాలలో మంచినీటి పైపులైన్ నిర్మాణం కోసం సుమారు ఏడాది క్రితం జీవీఎంసీ అధికారులు చక్కగా ఉన్న సిమెంట్ రోడ్డును ఒకపక్క తవ్వించారు. పైపులైన్ పనులు పూర్తయినప్పటికీ కాంక్రీట్ పనులు చేపట్టడాన్ని విస్మరించారు. దీంతో నిత్యం అక్కడివారికి అవస్థలు తప్పడం లేదు. ఈ సమస్యను సుమారు ఐదు నెలల క్రితం జీవీఎంసీ డీఈ వద్ద ప్రస్తావించగా, పైపులైన్ లీకేజీలు లేకుండా చూసిన అనంతరం కాంక్రీట్ పనులు చేస్తామని చెప్పారు. అయితే ఆయన పదవీ విరమణ చేసి నెలలు గడిచింది. అయినప్పటికీ నేటి వరకు ఇక్కడ ఈ పనులను పట్టించుకునేవారు కరువయ్యారు. దిబ్బవీధిలో ఒక పక్క ఇళ్లు, మరో పక్క దుకాణాలు ఉంటాయి. వీటి ముందు పైపులైన్ కోసం రోడ్డును తవ్వేయడంతో నివాసితులతో పాటు దుకాణాల నిర్వాహకులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డు తవ్వినచోట పలువురు ఇళ్ల నిర్మాణ సమయంలో వృథా మట్టిని తెచ్చి వేస్తున్నారు. అయినా వాహనచోదకుల రాకపోకలకు అవస్థలు తప్పడం లేదు. వాహనాలు ఎక్కడ అదుపు తప్పుతాయోనని ద్విచక్ర వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. అలాగే ఆడారివారి ఇళ్ల వద్ద కల్వర్టు కూడా దెబ్బతింటుంది. ఈ కల్వర్టు పైనుంచి వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. కల్వర్టు ప్రారంభంలో బాగా దెబ్బతిని ఉండడంతో వాహనాల టైర్లు పాడవుతున్నాయని వాపోతున్నారు. జీవీఎంసీ అధికారులు ఇప్పటికైనా స్పందించి పైపులైన్ పనుల కోసం తవ్వి వదిలేసిన చోట కాంక్రీట్‌తో సరిచేయాలని, అలాగే కల్వర్టును మెరుగుపర్చాలని ఇక్కడివారంతా కోరుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ జోనల్ డీఈ గోపాలకృష్ణను 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా, పైపులైన్ నిర్మాణం కారణంగా తీసిన గోతిల్లో సిమెంట్ కాంక్రీట్ పనులు రెండు రోజుల్లో ప్రారంభిస్తామని చెప్పారు.

లంకెలపాలెం కూడలిలో ప్రమాదాల నివారణకు చర్యలు : సీఐ



లైట్ల ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ, కార్పొరేటర్

లంకెలపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి లంకెలపాలెంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని పరవాడ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. జీవీఎంసీ 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్‌తో కలిసి బుధవారం ఆయన కూడలిని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇక్కడి జంక్షన్‌లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసినప్పటికీ రాత్రి సమయంలో లైట్లు లేకపోవడంతో ఏం జరిగినా గుర్తించలేకపోతున్నామన్నారు. కార్పొరేటర్ చొరవతో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. నిత్యం రద్దీగా ఉండే ఈ జంక్షన్‌లో తప్పని సరిగా ప్రతి ఒక్కరూ రహదారి భద్రతా నియమాలను పాటించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలి'



సమావేశంలో మాట్లాడుతున్న యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యం

అనకాపల్లి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని యూనైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్, కాం ట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేపాడ సత్యం డిమాండ్ చేశారు. ఇక్కడి సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన రీజనల్ కమిటీ సమావేశంలో మాట్లాడారు. విద్యుత్ రంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తెలంగాణ ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులందరినీ విద్యుత్ సంస్థలో విలీనం చేసిందన్నారు. ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం కాంట్రాక్ట్ కార్మికులను అలాగే కొనసాగిస్తున్నారన్నాని వాపోయారు. సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, ఉద్యోగులు దీర్ఘకాలికంగా ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని కోరారు. సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణల వల్ల విద్యుత్ సంస్థలు నష్టాల్లోకి కూరుకుపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిని అంతా ముక్తకంఠంతో వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఈ కార్య క్రమంలో యూనియన్ రీజనల్ కమిటీ అధ్యక్షుడు ప్రేమచంద్రశేఖర్, యూనియన్ నాయకులు జమీలు, శ్రీను, నాగఅప్పారావు, కె.రవికుమార్, అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి పూర్వ వైభవం తెస్తా..

▸▸ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కరణం ధర్మశ్రీ

అనకాపల్లి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వైసీపీకి పూర్వ వైభవం తీసుకు వచ్చేందుకు కృషి చేస్తానని ఆ పార్టీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్తగా నియామకమైన కరణం ధర్మశ్రీ తెలిపారు. ఇక్కడి రింగు రోడ్డులోని కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు నియోజకవర్గాల సమన్వయకర్తలతో మాట్లాడి పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు. మాజీ ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, మాజీ మంత్రి అమర్‌నాథ్ సహకారంతో పార్టీని ముందుకు తీసుకువెళ్తామన్నారు. అమలు కాని హామీలను ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చారన్నారు. ఈ నెల 31వ తేదీన పార్లమెంట్ పార్టీ సమన్వయకర్తగా బాధ్యతలు చేపట్టనున్నానని వివరించారు. ఈ సమావేశంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, పార్టీ నాయకులు దంతులూరి దిలీప్‌కుమార్, మలసాల రమణారావు, మందపాటి జానకిరామరాజు, కోరుకొండ రాఘవ తదితరులు పాల్గొన్నారు.

కుష్టు వ్యాధి నివారణపై కేంద్ర బృందం సర్వే



కశింకటో దాడి వీధిలో ప్రజలతో మాట్లాడుతున్న కేంద్ర బృందం

కశింకోట/సబ్బవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కుష్టు వ్యాధి నివారణ చర్యల్లో భాగంగా కేంద్ర బృందం కశింకోటలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేపట్టింది. ఫిబ్రవరి రెండో తేదీ వరకు జరగనున్న సర్వే తనిఖీల్లో భాగంగా బుధవారం దాడి వీధిలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలతో మాట్లాడారు. కేంద్ర బృందంలోని డైరెక్టర్ డాక్టర్ విజయ్ కుమారన్, సభ్యురాలు డాక్టర్ భాగ్యజ్యోతి, రాష్ట్ర లెప్రసీ విభాగం అధికారి డాక్టర్ ఎం.ఎస్.వి.కె.బాలాజీ తదితరులు ప్రజలకు కుష్టు వ్యాధి లక్షణాల గురించి వివరించారు. అనంతరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ తిరుపతిరావు, డాక్టర్ యశోద, హెచ్‌ఈవో సిహెచ్.సత్యనారాయణ, పిహెచ్‌ఎన్, సూపర్ వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశలు, సిబ్బంది పాల్గొన్నారు. ఇదిలావుంటే, సబ్బవరంలో సదరు బృందం సభ్యులు పర్యటించారు. ఈ సర్వేను పక్కాగా నిర్వహించాలని బృందం డైరెక్టర్ డాక్టర్ విజయకుమారన్ సిబ్బందికి సూచించారు. సబ్బవరంతో పాటు పలు గ్రామాలు పర్యటించి ఆశ, వలంటీర్లు, వైద్య సిబ్బంది నిర్వహిస్తున్న ఇంటింటి సర్వేను పరిశీలించి సూచనలు చేశారు. అనంతరం ఆసుపత్రికి వెళ్లి రికార్డులను పరిశీలించారు. స్థానిక ఆసుపత్రి వైద్యులు డాక్టర్ ఎస్.చక్రవర్తి, గురుకుల కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాకృష్ణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

పీహెచ్‌సీలో 56 రకాల పరీక్షలు ఉచితం

\- హారిక, వైద్యాధికారిణి, పరవాడ



పరవాడ పీహెచ్‌సీలో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి. రోగులు ఎలాంటి ఇబ్బందులు పడాల్సిన పని లేదు. సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటున్నారు. 56 రకాల పరీక్షలు ఉచితంగానే చేస్తున్నాం.

ప్రశ్న : పీహెచ్‌సీలో మందుల కొరత ఏమైనా ఉందా..?

జవాబు : అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయి.

ప్రశ్న : రేబిస్ వ్యాక్సిన్ ఉందా..?

జవాబు : రేబిస్ వ్యాక్సిన్ సిద్ధంగా ఉంది. కుక్కకాటుకు గురైనవారు ఎక్కువగా పీహెచ్‌సీకి వస్తున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ముందస్తు చర్యల్లో భాగంగా అవసరమైన వ్యాక్సిన్‌ను అందుబాటులో ఉంచాం.

ప్రశ్న : ఆపరేషన్ థియేటర్‌లో పరికరాల పరిస్థితి ఏమిటి?

జవాబు : అన్ని పరికరాలు ఉన్నాయి. ఎలాంటి ఇబ్బంది లేదు.

ప్రశ్న : రోజువారీ ఓపీ సంఖ్య ఎలా..?

జవాబు : ప్రతి రోజూ 100 నుంచి 150 మంది వరకు రోగులు వస్తుంటారు. వారికి అవసరమైన చికిత్సచేసి మందులు అందజేస్తున్నాం.

ప్రశ్న : చలికాలంలో పిల్లల పట్ల ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి..?

జవాబు : గోరువెచ్చని నీళ్లను పట్టాలి. బయటకు వెళ్లకుండా చూసుకోవాలి. దగ్గు, జలుబు వచ్చే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కంగారు అవసరం లేదు.

ప్రశ్న : పీహెచ్‌సీలో ఎన్ని రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి.

జవాబు : 56 రకాల పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. అన్నీ ఉచితంగా చేస్తాం. రిపోర్ట్ ఒక రోజులో ఇస్తాం. రోగులు సద్వినియోగం చేసుకోవాలి.

\- పరవాడ

అనకాపల్లి జీవీఎంసీ స్పెషల్ ఆఫీసర్‌గా గోవిందరావు

అనకాపల్లి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : జీవీఎంసీ అనకాపల్లి జోనల్ స్పెషల్ ఆఫీసర్‌గా గోవిందరావు నియామకం అయ్యారు. జిల్లా కో-ఆపరేటివ్ అధికారిగా వ్యవహరిస్తున్న ఈయన స్పెషల్ ఆఫీసర్ హోదాలో బుధవారం అనకాపల్లి జోనల్ కార్యాలయానికి వచ్చి వివిధ విభాగాల అధికారులతో సమావేశమయ్యారు. ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. పరిశుభ్రత, తాగునీటి సరఫరా, వీధి దీపాలు వెలుగులు వంటివాటిపై సంబంధిత అధికారులతో సమీక్ష జరిపారు. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందేలా చూడాలని ఈ సందర్భంగా ఆయన ఆదేశించారు. ఈ సమావేశంలో అనకాపల్లి జోనల్ కమిషనర్ బీవీ రమణతో పాటు వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

రిపబ్లిక్ డే వేడుకల్లో గురుకుల విద్యార్థి ప్రతిభ



దేవీప్రసాద్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ రామకృష్ణ

సబ్బవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియంలో జరిగిన గణతంత్ర దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న సబ్బవరం గురుకుల పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థి దేవీప్రసాద్ చక్కని ప్రతిభ చూపాడు. ఈ సందర్భంగా బుధవారం పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రామకృష్ణ మాట్లాడుతూ గణతంత్ర వేడుకల్లో పరేడ్ సందర్భంగా నిర్వహించిన మార్చ్ పాస్ట్ విభాగంలో రాష్ట్రస్థాయిలో దేవీప్రసాద్ ప్రతిభ చూపి ప్రథమ బహుమతిని సాధించాడని ఆయన చెప్పారు. అనంతరం అతనిని ప్రిన్సిపాల్‌తో పాటు పీడీ, పీఈటీ, సిబ్బంది, తోటి విద్యార్థులు అభినందించారు.

కొత్తపల్లి హైస్కూల్ సైన్స్ ల్యాబ్‌కు మెటీరియల్స్ వితరణ



సైన్స్ ల్యాబ్ మెటీరియల్‌తో సంస్థ సిబ్బంది

కశింకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి) : కొత్తపల్లి జడ్పీ హైస్కూల్‌లోని సైన్స్ ల్యాబ్‌కు మండలంలోని క్రబ్స్ కంపెనీ యాజమాన్యం బుధవారం మెటీరియల్స్‌ను వితరణగా అందజేసింది. రూ.75వేల నిధులను వెచ్చించి వీటిని సమకూర్చింది. అదేవిధంగా వాల్కం ఇండియా ప్రైవేటు లిమిటెడ్ సంస్థ రూ.33వేలు నిధులతో సీసీ కెమేరాలను ఏర్పాటు చేసింది. వీరికి ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

స్టీల్‌ప్లాంటు పై స్పష్టమైన ప్రకటన చేయాలి

▸▸ జీపు జాతాలో కార్మిక నాయకులు డిమాండ్



అనకాపల్లి చిన నాలుగురోడ్ల జంక్షన్‌లో మాట్లాడుతున్న కార్మిక నాయకులు

అనకాపల్లి టౌన్, జనవరి29 (ఆంధ్రజ్యోతి) : విశాఖ స్టీల్‌ప్లాంటుకు ప్యాకేజీ కాకుండా ప్రైవేటీకరణ చేయబోమని స్పష్టమైన ప్రకటన చేయాలని స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు యు.రామస్వామి డిమాండ్ చేశారు. నెల్లూరులో ఫిబ్రవరి ఒకటి నుంచి మూడో తేదీ వరకు సీపీఎం రాష్ట్ర మహాసభలు జరగనున్న సందర్భంగా విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించాలని, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్‌లో విలీనం చేసి సొంతగనులు కేటాయించాలని కోరుతూ స్టీల్‌ప్లాంట్ నుంచి నెల్లూరు వరకు జీపు జాతను ప్రారంభించారు. బుధవారం ఈ జాత అనకాపల్లికి చేరుకున్న సందర్భంగా ఇక్కడి చిన నాలుగురోడ్ల జంక్షన్‌లో ఆ పార్టీ మండల కన్వీనర్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ ప్యాకేజీ కింద రూ.14,400 కోట్లు ఇచ్చి స్టీల్‌ప్లాంట్‌ను అదానీకి అమ్మాలని చూస్తున్నారని ఆరోపించారు. సంస్థను సెయిల్‌లో విలీనం చేయడానికి ఉన్న అభ్యంతరం ఏమిటని ప్రశ్నించారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియాలో విలీనం చేస్తే 40వేల ఉద్యోగాలు వస్తాయని ఈ ప్రాంత నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని వివరించారు. నెల్లూరులో జరిగే సీపీఎం మహాసభల్లో స్టీల్‌ప్లాంట్ కోసం గత ఉద్యమాలను సమీక్షించి భవిష్యత్తులో మరిన్ని ఉద్యమాలు చేయడానికి కార్యాచరణ రూపొందిస్తామన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, ఆర్.శంకరరావు, వీవీ శ్రీనివాసరావు, అల్లు రాజు, బి.ఉమామహేశ్వరరావు, చలపతి, కె.తేలయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

పరవాడ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను సెయిల్‌లో విలీనం చేయా లని డిమాండ్ చేస్తూ సీపీఎం చేపట్టిన జీపు జాత బుధవారం లంకెలపాలెం జంక్షన్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.లోకనాథం మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ చేయబోమని కేంద్రం స్పష్టమైన ప్రకటన చేయాలని, సొంత గనులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, స్టీల్‌ప్లాంట్ యూనియన్ నాయకులు ఎం.రామారావు, జి.కోటేశ్వరరావు, కె.వెంకటరావు, డి. దేమ

ుడు, శ్రీను, రాము తదితరులు పాల్గొన్నారు.

అరకు ఉత్సవ్‌కు తరలిరండి

» సినీ నటుడు రాజీవ్‌కనకాల ఆహ్వానం


మాట్లాడుతున్న రాజీవ్‌కనకాల

అరకులోయ,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి అందాలకు నిలయమైన అరకులోయలో జరగనున్న చలి ఉత్సవాలకు ప్రతి ఒక్కరూ తరలి రావాలని సినీ నటుడు రాజీవ్‌కనకాల ఆహ్వానించారు. ఉత్సవాల నేపథ్యంలో బుధవారం వీడియో క్లిప్పింగ్‌ను జోడించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్ఠాత్మకంగా జనవరి 31,ఫిబ్రవరి 1,2 తేదీలలో అరకులోయలో చలి ఉత్సవాలను నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ఈ నేపథ్యంలో తెలుగు రాష్ట్రాలతోపాటు పొరుగున ఉన్న రాష్ట్రాలకు చెందిన వారూ కుటుంబాలతో తరలిరావాలని రాజీవ్ కనకాల ఆహ్వానం పలికారు. సమారు పదిరాష్ట్రాల నుంచి గిరిజన కళాకారులు విచ్చేసి వారి సంస్కృతి, సంప్రదాయలను ప్రదర్శించనున్నట్టు చెప్పారు. అరకుప్రాంత గిరిజనం ప్రదర్శనలు చేపట్టనున్నారన్నారు. అంతే కాకుండా గతానికి భిన్నంగా సందర్శకులను అలరించేందుకు హెలీకాప్టర్ జోయ్‌రైడ్, పెరాగ్లైడింగ్, హాట్‌ఎయిర్‌బెలూన్ తదితర సాహస క్రీడలు అందుబాటులో ఉంటాయన్నారు. వీటి అన్నింట్లో పాలుపంచుకునేందుకు అరకు చలి ఉత్సవ్‌కు తరలిరావాలని పర్యాటకులు ప్రత్యేకంగా రాజీవ్‌కనకాల ప్రకటన విడుదల చేశారు.

కేజీహెచ్‌కు బాలుడి తరలింపు


చిన్నారిని పరిశీలిస్తున్న వైద్యాధికారి సత్యారావు

పెదబయలు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అంతుపట్టని వైరస్ గిన్నెలకోట పంచాయతీలో చిన్నారులకు ప్రబలిన విషయం విషయం తెలిసిందే. గిన్నెలకోట, చింతగరువు, లండులు, ఇనుపతీగల, గొచ్చంగి, మెట్టగూడ గ్రామాలలో గత రెండు రోజులుగా కొత్త కేసులు నమోదు కాకున్నా, ఈ గ్రామాల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉన్న చిన్నారి బూడిద అంజోల్‌రావు, సంధ్య దంపతుల కుమారుడు ఆదిత్యరాజ్ (20 నెలలు)ను బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా ఊపిరి తీసుకోవడం ఇబ్బందిగా మారటంతో వైద్యాధికారి సత్యారావు తక్షణమే బాలుడి ఇంటి వద్ద చేరుకున్నారు. తల్లిదండ్రులతో మాట్లాడి అంబులెన్స్‌లో ఆ బాలుడిని పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. అక్కడి వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. పాడేరు జిల్లా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న 27 మంది చిన్నారులు సురక్షితంగా ఉన్నట్టు వైద్యులు చెబుతున్నారు.

గర్భిణికి వైద్యుల కౌన్సెలింగ్

» ప్రసవానికి ఆస్పత్రికి తరలింపు

గూడెంకొత్తవీధి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నెలలు నిండిన గర్భిణీ ప్రసవం కోసం ఆస్పత్రికి వెళ్లేందుకు నిరాకరించడంతో వైద్యులు, పారామెడికల్ ఉద్యోగులు ఆమెకుఉ కౌన్సెలింగ్ చేసి అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. మండలంలోని దేవరాపల్లి పం చాయతీ జర్రలబంద గ్రామానికి చెందిన గెమ్మెలి రాధకు నెలలు నిండి ప్రసవ సమయం దగ్గరపడింది. ఆశ కార్యకర్త వెళ్లి ఆస్పత్రికి రావాలని కోరినా, ఆమె స్పందించలేదు. దీంతో జీకేవీధి వైద్యాధికారి అచ్యుత్, పారామెడికల్ సిబ్బంది గ్రామానికి వెళ్లి గర్భిణీకి కౌన్సెలింగ్ చేశారు. తొలుత ఆమె ఆస్పత్రికి వచ్చేందుకు అంగీకరించలేదు. వైద్యులు నచ్చజెప్పడంతో ఆమె సాయంత్రం అంగీకరించింది. దీంతో ఆమెను అంబులెన్సులో జీకే వీధి ఆస్పత్రికి తరలించారు.

సస్య రక్షణ చర్యలతో అధిక దిగుబడులు

» మామిడి, జీడిమామిడి రైతులకు ఏవో ఉమాదేవి సూచనలు


పూత దశలో జీడిమామిడి, మామిడి తోటలు



కొయ్యూరు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి):సస్య రక్షణ, యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా మామిడి, జీడిమామిడిలో మేలైన దిగుబడులు సాధించేందుకు అవకాశం ఉంటుందని స్థానిక మండల వ్యవసాయ శాఖాధికారిణి ఉమాదేవి సూచించారు. ఈ మేరకు ఉద్యానశాఖ సిబ్బందితో కలసి రైతులకు అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ఆమె అందించిన వివరాలి.. పూత రాలిపోకుండా, అధిక దిగుబడుల సాధనకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు పాటించాలి. వర్షాలు పుష్కలంగా కురవటంతో గత ఏడాదితో పోలిస్తే ఈ సారి మామిడి, జీడి మామిడి దిగుబడులు పెరిగే ఆస్కారం ఉంది. అయితే, ఇప్పటికే 50 శాతం పూత వచ్చిన తోటలకు నీటి తడులు పెడితే పూర్తిస్థాయిలో పూత మరింతగా వచ్చే అవకాశం ఉంటుంది. అసలు పూత రాని తోటల్లో లీటరు నీటికి 10 గ్రాములు పొటాషియం నైట్రేట్ కలిపి పిచికారీ చేస్తే కాండం నుంచి పూత వస్తుంది. అలాగే, పిందె కట్టిన తోటలకు ఒకసారి నీటి తడి ఇచ్చి మూడోసారి ఎరువులు వేస్తే పిందెలు రాలిపోకుండా నిలిచి కాయలుగా మారుతాయి.. సాధారణ నేలల్లో సూక్ష్మ .దాతువులుంటేజింక్ సల్ఫేట్ 5 గ్రాములు, బోరాన్ 2 గ్రాములు చొప్పున లీటరు నీటిలో కలిపి చిగుర్లపై పిచికారీ చేయాలి. ప్రస్తుతం మంచు బాగా కురుస్తున్నందున తేనె మంచు పురుగు నివారణకు లీటరు నీటిలో డైమిథోయేట్ 2 మి.లీ. పొటాషియయం నైట్రేట్ 10 గ్రాములు కలిపి పిచికారీ చేయాలని తెలిపారు. రసం పీల్చే పురుగు ఆశిస్తే అసిఫేట్ 10 గ్రాములు లేదాక్లోరీ ఫైరీపాస్ 20ఈసీ 2.5 మి.లీ.డైక్లోరోపాస్0.5 మి.లీ., మాంకోజెట్ 2.5 గ్రాములు లీ టరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి. బూడిద తెగులు ఆశిస్తే హెక్సాకోనాజోల్ 2 మి.లీ. లేదా ట్రైడిమార్ఫ్ గ్రాము కలిపి చల్లాలన్నారు.అ యితే పూత విచ్చుకునే సమయంలో మందులు పిచికారీ చేయకూడదని రైతులకు ఏవో సూచించారు.


ఉమాదేవి, ఏవో, కొయ్యూరు

జన్‌మన్ గృహ నిర్మాణాలు వేగవంతం

» గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బాబు


లబ్ధిదారులతో మాట్లాడుతున్న పీడీ బాబు

ముంచంగిపుట్టు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి జన్‌మన్ గృహాలు నిర్మాణ పనులు త్వరగతిన పూర్తి చేయాలని జిల్లా గృహ నిర్మాణ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ బి.బాబు అన్నారు. మండలంలోని కిలగాడ పంచాయతీ తరిగెడ గ్రామంలో బుధవారం ఆయన పర్యటించారు. గృహాలను పరిశీలించారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం గృహాల మంజూరు, నిర్మాణంలో నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మండల పరిధిలో జన్‌మన్ పథకంలో 3,400 గృహాలు మంజూరయ్యాయని, లబ్ధిదారులు సకాలంలో వాటి పనులను పూర్తి చేసుకోవాలని సూచించారు. గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్మాణంలో ఉన్న ఇళ్లను ఎప్పటికప్పుడు పర్యావేక్షించాలని ఆదేశించారు. జిల్లాలో నూతనంగా పీఎంఏవై ద్వారా గ్రామాల్లో గృహాల మంజూరుకు సర్వే చేపడుతున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ కృష్ణారావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ఏకలవ్య' బాధితులకు బీజేపీ సంఘీభావం


బాధితులకు మద్దతు తెలుపుతున్న బిజేపీ నాయకులు

డుంబ్రిగుడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏకలవ్య మోడల్ గురుకుల విద్యాలయానికి భూములు ఇచ్చిన బాధితుల ఆందోళనకు బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు. బుధవారం ఆ పార్టీ కాఫీ బోర్డు సభ్యుడు విశ్వనాథం, మండల కార్యదర్శి కామేశ్వరరావు బాధితుల ఆందోళన శిబిరంలో కూర్చొని మద్దతు పలికారు. ఉపాధి కల్పిస్తారన్న భరోసాతో గిరిజన రైతులు భూములు ఇచ్చారని, తీరా పాఠశాల ప్రారంభించిన తర్వాత అధికారులు మోసం చేయడం విచారకరమన్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు బాధితులకు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు రాందాస్ పాల్గొన్నారు.

నేడు జాబ్ మేళా

చింతపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్ ఆవరణలో గురువారం జాబ్ మేళా నిర్వహించనున్నట్టు స్థానిక ఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు. ప్రేరణ కార్యక్రమంలో భాగంగా స్థానిక ఏఎస్పీ నవజ్యోతి మిశ్రా పర్యవేక్షణలో ఈ జాబ్‌మేళా ఏర్పాటు చేశామన్నారు. చింతపల్లి సబ్ డివిజన్ పరిధిలోని 400మంది యువతీ, యువకులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారన్నారు. అర్హతలు ఆధారంగా టాటా ఎలక్ట్రానిక్ సంస్థలో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. 18-26ఏళ్ల వయస్సు కలిగి పది, ఇంటర్మీడియట్, డిగ్రీ, ఐటీఐ, డి ప్లొమా పూర్తి చేసి యువత అర్హులన్నారు. ఈ అవకాశాన్ని గిరిజన నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉద్యోగాలకు 291మంది ఎంపిక

» చింతపల్లి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ విజయ భారతి


ఇంటర్న్‌షిప్, ఉద్యోగాల కోసం ప్రయాణమైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

చింతపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): చింతపల్లి సబ్ డివిజన్ నుంచి ఫాక్స్‌కాన్ ప్రైవేటు కంపెనీలో ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్ కోసం 291మంది గిరిజన యువత ఎంపికైనట్టు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం. విజయ భారతి అన్నారు. బుధవారం వారు ఇక్కడినుంచి ప్రత్యేక బస్సుల్లో తరలివెళ్లారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ, డిగ్రీ కళాశాలలో ఇ టీవల తిరుపతి సమీపంలోని తాడ శ్రీసిటీకి చెందిన ఫాక్స్‌కాన్ కంపెనీలో ఉద్యోగాలు, ఇంటర్న్‌షిప్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించామన్నారు. ఇందులో అర్హత సాధించిన యువతీ, యువకులు, విద్యార్థులను అధ్యాపకుల పర్యవేక్షణలో బస్సుల్లో కంపెనీకి తీసుకువెళ్తున్నట్టు వివరించారు. ఈ ఎంపికైన విద్యార్థులకు నెల రూ. 18వేల వేతనం , భోజన, వసతి సదుపాయం కల్పిస్తారన్నారు. ఇంటర్న్‌షిప్‌కి వెళ్లిన 130మంది విద్యార్థులు ఆరు నెలల్లో తిరిగి కళాశాలకు వస్తారన్నారు. ఉద్యోగాల కోసం వెళ్లిన 161మంది కంపెనీలో పనిచేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కె. లీలాపావని, తాంగుల జగన్రాయ్, ఎం.నాగేంద్రబాబు, ఈశ్వరరావు, పూర్ణరావు, నాగేశ్వరరావు, రమణ పాల్గొన్నారు.

ఆర్థిక వ్యవస్థను దివాలా తీయించిన జగన్‌రెడ్డి

» టీడీపీ అరకు ఇన్‌చార్జి, ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర



అరకులోయ జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ తదితర పథకాలకు సంబంధించి జగన్ ప్రభుత్వం బకాయిలుగా ఉన్న సుమారు రూ.22 వేల కోట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చెల్లించినట్టు టీడీపీ అరకు అసెంబ్లీ ఇన్‌చార్జి, విజయనగరం ఆర్టీసీ రీజియన్ చైర్మన్ దొన్నుదొర తెలిపారు. బుధవారం సాయంత్రం అరకులోయలో తన నివాసంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.జగన్‌రెడ్డి రాష్ట్రాన్ని లక్షల కోట్ల రూపాయల అప్పులోకి నెట్టేశారన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి రుణ భారం రూ. 10 లక్షల కోట్లుందన్నారు.ఏడాదికి రూ.71వేల కోట్లు అసలు,వడ్డీ చెల్లించాల్సిన దుస్థితికి తీసుకువచ్చాడన్నారు.అయినా ముఖ్యమంత్రి చంద్రబాబు బకాయిలు, వ డ్డీలు చెల్లిస్తూ మరోవైపుసంక్షేమపథకాలు,అభివృద్ధి పనులు చేపడుతున్నారన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

పాడేరురూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ సబ్ స్టేషన్‌లలో ఫీడర్ మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఈ నెల 31వ తేదీ శుక్రవారం జి.మాడుగుల, హుకుంపేట మండలాల్లోని వివిధ గ్రామాలకు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ ఏవీఎస్‌ఎం. అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.మాడుగుల మండలంలోని సొలభం, గడుతూరు, వంతాల పెదలోచలి గ్రామాలు, హుకుంపేట మండలంలోని శోభకోట, మఠం, గంపరాయి, కోడాపల్లి, కిముడుపల్లి గ్రామాల వినియోగదారులుసహకరించాలని కోరారు.

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు తప్పనిసరి

హుకుంపేట జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అర్హులు కుటుంబ నియంతణ ఆపరేషన్లు చేయించుకోవాలని జిల్లా వైద్య శాఖ సూపరింటెండెంట్ తెలిపారు. బుధవారం మండలంలోని ఉప్ప ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి రేఖ ఆధ్వర్యంలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఆపరేషన్లకు 80 మంది వరకు హాజరుకావడం ఆనందదాయకమని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యులు ప్రతాప్, శివప్రసాద్, నిఖిల్, సందీప్, హెల్త్ అసిస్టెంట్ మురళీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

భూ బదలాయింపు చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తే సహించం

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

పాడేరురూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గిరిజన హక్కులు చట్టాలను ఉల్లంఘించాలని ప్రయత్నించే వారెవరైనా సహించేదిలేదని స్థానిక ఎమ్మెల్యే ఎం.విశ్వేశ్వరరాజుహెచ్చరించారు. 1/70 చట్టంపై శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు చేసిన వ్యాఖ్యలపై బుధవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ధ్వజమెత్తారు. గిరిజన చట్టాలు హక్కులపై అయ్యన్న తీరు మార్చుకో కుంటే గుణపాఠం తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో వైసీపీ నాయకులు తిమోతీ, గబ్బాడ చిట్టిబాబు, శరభ సూర్యనారాయణ, పి.రాజేష్, బి.మహేష్ ఊర్వశీరాణి తదితరులు పాల్గొన్నారు. స్పీకర్ 1/70 చట్టంపై చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని అఖిల భారత గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు ముఖి శేషాద్రి అన్నారు. గిరిజన ఉద్యోగుల భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో నాయకులు బి.సింహాచలం పాల్గొన్నారు.

పాడేరురూరల్: ఆదివాసీ ప్రాంతంలో గిరిజన హక్కుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన 1/70 చట్టం పటిష్ఠంగా అమలు చేయాలని గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు ఈ చట్ట సవరణపై చేసిన వ్యాఖ్యలకు స్పందించి స్థానిక గిరిజన సంఘం భవనంలో బుధవారం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. మన్యంలో అమలులో ఉన్న 1/70 చట్టంపై తెలుగుదేశం పార్టీ విధానం ఏమిటో స్పష్టంగా ప్రకటించాలని ఆయన డిమాండ్ చేశారు. గిరిజన ప్రాంత ప్రజలకు ప్రధానమైన 1/70 చట్టంపై సభాపతి అయ్యన్న పాత్రుడు చేసిన వాఖ్యలకు నిరసనగా పాడేరు డివిజన్ 11 మండలాల్లో ఈ నెల 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 3వ తేదీ వరకు నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. 1/70 చట్టానికి విఘాతం కలిగించే అరకు చలి ఉత్సవాలను ఆదివాసీ ప్రజలు వ్యతిరేకించాలని కోరారు. స్పీకర్ ప్రకటనను తెలుగుదేశం పార్టీ వెనక్కి తీసుకోవాలని రౌండ్ టేబుల్ సమావేశంలో తీర్మానం చేశారు. ఆదివాసీలకు రక్షణ కవచంగా ఉన్న చట్టం సవరించి షెడ్యూల్ ప్రాంతాన్ని కార్పొరేట్ కంపెనీకు ధారాదత్తం చేయాలని కూటమి ప్రభుత్వ లక్ష్యంగా కనిపిస్తోందని ఆరోపించారు. బడాబాబులు అడుగుపెడితే ఆదివాసీల సహజ సంపదలు, అడవులు, ఖనిజాలు ధ్వంసమవుతాయని ఆందోళన వ్యక్తంచేశారు. మన్యంలో బినామీ పేర్లతో లాడ్జీలు, షాపింగ్ కాంప్లెక్స్‌లు, రిసార్ట్స్ నిర్మాణాలు యథేచ్ఛగా సాగుతున్నాయన్నారు. ఇక, ఈ చట్టంలేకుంటే ఆదివాసీలకు ఇక మనుగడే ఉండదన్నారు. ఈ సమావేశంలో వివిధ సంఘాల నాయకులు ఎస్. .దర్మానపడాల్, కూడా రాధాకృష్ణ, వంతాల నాగేశ్వరరావు, పాలికి లక్కు, జి. జీవన్, కె.కార్తీక్, వి.కృష్ణ, ఎం.లక్ష్మణ్, రూడి బొజ్జన్న తదితరులు పాల్గొన్నారు.


రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సురేంద్ర

స్పీకర్ అయ్యన్న వ్యాఖ్యలకు ఖండన

చింతపల్లి: షెడ్యూల్డ్ ప్రాంతాల ఆదివాసీ భూములకు ఉన్న 1/70 భూ బదలాయింపు చట్టం సవరించాలని స్పీకర్ అయ్యన్నపాత్రుడు చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్టు స్థానిక ఎంపీపీ కోరాబు అనుషదేవి అన్నారు. బుధవారం జడ్పీటీసీ సభ్యుడు పోతురాజు బాలయ్య, వైస్ ఎంపీపీలతో కలిసి ఆమె విలేకరులతో మాట్లాడారు. సుదీర్ఘ రాజకీయ అనుభవం కలిగిన వ్యక్తి అయ్యన్నపాత్రుడు 1/70 చట్టాన్ని సవరిస్తేనే పెట్టుబడులు వస్తాయనడం బాధాకరమన్నారు. వైస్‌ఎంపీపీలు గోపీనాయక్ శారద, సాగిన వెంగళరావు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

చింతపల్లి: భూబదలాయింపు చట్టంపై స్పీకర్ చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాలని గిరిజన ఉద్యోగుల సంఘం మండలాధ్యక్షుడు బౌడు గంగరాజు అన్నారు. షెడ్యూల్డ్ ప్రాంతాల్లో అమలులోనున్న భూబదలాయింపు చట్టం సవరించడం రాజ్యాంగం పరిధిలో ఉంటుందన్నారు. ఈచట్టాన్ని సవరించడం సాధ్యంకాదన్నారు. గిరిజన ఉద్యోగుల సంఘం నాయకులు యూవీ గిరి, ఎంవీ రమణ, లోచలి చిట్టినాయుడు, కేవీ రమణ, రామచంద్రుడు, ప్రసాద్ పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: భూబదలాయింపు చట్టాన్ని నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తే సహించేదిలేదని వంచుల పీసా కమిటీ నాయకుడు గాబ్రియేలు అన్నారు. బుధవారం పేసా కమిటీ నాయకులు మాట్లాడుతూ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు భూబదలాయింపు చట్టాన్ని సవరిస్తేనే పెట్టుబడులు వస్తాయని, టూరిజం అభివృద్ధి చెందుతుందని మాట్లాడడం బాధాకరమని అన్నారు. కమిటీ నాయకులు అశోక్, సత్యనారాయణ, సూర్యనారాయణ, వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.

పాడేరులో రెడ్ క్రాస్ భవనాలకు నిధులు ఇస్తా..

» కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు


కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వినతి ప్రతమిస్తున్న రెడ్‌క్రాస్ ప్రతినిధులు

పాడేరురూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును పాడేరుకుచెందిన రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు ఎస్.గంగరాజు, జి.గౌరీశంకరరావు, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర కమిటీ మెంబర్ బొర్రా నాగరాజు బుధవారం శ్రీకాకుళం ఆయన స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అల్లూరి జిల్లా కేంద్రం పాడేరులో సొసైటీ కార్యాలయ భవనానికి కలెక్టర్ 10 సెంట్ల స్థలాన్ని కేటాయించారని, ఈ నిర్మాణానికి సహకారం అందించాలని వారు మంత్రిని కోరారు. స్పందించిన ఆయన పాడేరులో రెడ్‌క్రాస్ సొసైటీ భవనం, బ్లడ్ బ్యాంక్ కార్యాలయ నిర్మాణానికి నిధులు ఇస్తానని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో రామ్మోహన్ నాయుడుకు పాలకవర్గ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

మత్స్యగుండం శివరాత్రి ఉత్సవాల కమిటీ ఎన్నిక


ఎన్నికైన ఉత్సవ కమిటీ సభ్యులు

హుకుంపేట జనవరి 29: ఆంధ్రజ్యోతి; గిరిజనుల ఆరాధ్య దైవం మత్స్యలింగేశ్వర స్వామి మహాశివరాత్రి ఉత్సవాల కమిటీ ఎన్నికకు ఆలయ కమిటీ అధ్యక్షుడు తమర్బ అప్పారావు సమక్షంలో బుధవారం ఎన్నిక నిర్వహించారు. ఈ కమిటీ చైర్మన్‌గా స్థానిక సర్పంచ్ శాంతికుమారి, అధ్యక్షుడిగా గోపాల్ పాత్రుడు, ప్రధాన కార్యదర్శిగా పాంగి మత్స్య కొండబాబు, కోశాధికారిగా చెట్టిహరినాథ్, ఉపాధ్యక్షుడిగా అశ్వర్‌రావు, కార్యదర్శిగా బాలయ్య కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. ఫిబ్రవరి 25, 26,27 జరిగే మహా శివరాత్రి ఉత్సవాలను నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో జన్ని అప్పారావు, సింహాచలం, చంద్రశేఖర్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

క్రీడా మైదానంలో పారిశుధ్య పనులు

ముంచంగిపుట్టు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): స్థానిక హోలీ క్రీడా మైదానంలో పారిశుధ్య పనులు చేపట్టేలా చర్యలు తీసుకుంటున్నట్టు ఎంపీడీవో ఎం.శ్రీహర్షసాయి అన్నారు. ఈ మైదానంతో ఎక్కడపడితే అక్కడ చెత్త, మురుగునీరు లోనికి ప్రవేశించడంతో క్రీడలు ఆడుకునేందుకు ఇబ్బందిగా ఉన్నట్టు స్థానిక క్రీడాకారులు ఎంపీడీవో దృష్టికి బుధవారం తీసుకువెళ్లారు. దీంతో ఆయ స్పందించిన ఆయన మైదానాన్ని పరిశీలించారు. బాలికల ఆశ్రమ పాఠశాల- 2 నుంచి మురుగు నీరు మైదానంలోకి ప్రవేశిస్తున్నట్టు గుర్తించారు. వెంటనే ఫోన్‌లో ఏటీడబ్ల్యూవో స్వర్ణలతతో మాట్లాడారు. మురుగు రాకుండా చూడాలని ఆమె ఆదేశించారు. పరిసర వాసులు చెత్త వేయరాదని కోరారు.

మావోయిజానికి గిరిజనులు దూరంగా ఉండాలి: ఎస్ఐ

ముంచంగిపుట్టు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గిరిజనులు మావోయిజానికి దూరంగా ఉండాలని, అప్పుడే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని స్థానిక ఎస్ఐ జె. రామకృష్ణ అన్నారు. బుధవారం మండలంలోని మారుమూల రంగబయలు పంచాయతీ పరిధిలో పలు గ్రామాలను ఆయన సందర్శించారు. గిరిజనులతో సమావేశమయ్యారు. అక్కడ నెలకొన్న సమస్యలు, వారి సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్పీ పోలీసులు ఉన్నారు.

అర్హులైన గిరిజనులకు ఎల్‌పీసీలు ఇవ్వాలని వినతి

పాడేరురూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): మండలంలో సొంత స్థలం ఉన్న అర్హులైన గిరిజనులు గృహ నిర్మాణాలకు పెసా కమిటీ అనుమతితో ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్లను ఇవ్వాలని కోరుతూ పెసా కమిటీ ప్రతినిధులు సల్లా రామకృష్ణ, బోనంగి వెంకటరమణ, కొట్టగుల్లి సింహాచలం నాయుడు తదితరులు బుధవారం తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం నూతనంగా పీఎం ఆవాస్ యోజన పథకం ద్వారా గిరిజనులకు గృహ నిర్మాణాలకు అనుమతులు ఇస్తున్నందున సొంత స్థలం ఉన్న అర్హులకు ఎల్‌పీసీలు ఇవ్వాలని కోరామన్నారు. తహసీల్దార్ సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు.

ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజును కలిసిన పాస్ పోర్టు ఆఫీసర్

పాడేరురూరల్, జనవరి 29(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వరరాజును ఆయన క్యాంప్ కార్యాలయంలో అరకు పాస్ పోర్టు ఆఫీసర్ గుడ్డి శ్రీనివాసుల నాయుడు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేను మోదకొండమ్మ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడును ఆయన పుష్పగుచ్ఛాలిచ్చి సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

పెదబయలులో ఆక్రమణలు తొలగింపునకు చర్యలు

పెదబయలు, జనవరి29 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఆర్‌అండ్‌బీ రోడ్డుకు ఇరువైపులా దుకాణాలను వారం రోజుల్లో తొలగించాలని స్థానిక ఇన్‌చార్జి తహసీల్దార్ రంగారావు ఆదేశించారు. కలెక్టర్ దినేశ్‌కుమార్ ఆదేశాల మేరకు బుధవారం ఆయన, సిబ్బందితో కలిసి స్థానిక స్టేట్ బ్యాంక్ నుంచి పెట్రోల్ బంక్ వరకు ప్రధాన రహదారికి ఇరువైలు రోడ్డు మధ్య నుంచి 25 అడుగుల మేర మార్కింగ్ ఇచ్చారు. మార్కింగ్ లోపల గల వర్తకులు స్థలాలను ఖాళీ చేయాలని, లేకుంటే తామే తొలగిస్తామని హెచ్చరించారు.

టీడీపీ సభ్యత్వాలకు విశేష స్పందన

చింతపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సభ్యత్వాలకు గిరిజనుల నుంచి విశేష స్పందన లభిస్తుందని ఆ పార్టీ మండలాధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో టీడీపీ నాయకులు సభ్యత నమోదు చేశారు. ఈసందర్భంగా పూర్ణ చం ద్రరావు మాట్లాడుతూ సభ్యత్వం తీసుకున్న సభ్యులకు రూ.ఐదు లక్షల ప్రమాదబీమా వర్తిస్తుందన్నారు. ఈ సభ్యత్వ నమోదు గడువు గురువారంతో ముగుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు రీమల ఆనందరావు, పెదిరెడ్ల బేతాళుడు, రామకృష్ణ పాల్గొన్నారు.

వైరస్ బాధిత చిన్నారులకు మెరుగైన వైద్యం: జీసీసీ చైర్మన్


పాడేరు ఆస్పత్రిలో బాధితులను పరామర్శిస్తున్న శ్రావణ్‌కుమార్

పాడేరు, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): మీజిల్స్ వ్యాధితో బాధపడుతూ స్థానిక జిల్లా ఆస్పత్రిలో వైద్య సేవలు పొందుతున్న పెదబయలు మండలానికి చెందిన బాధిత చిన్నారులను జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారుల తల్లిదండ్రులు ఎటువంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అందరికీ మెరుగైన వైద్య సేవలు అందించే ఏర్పాట్లు చేశామన్నారు. అలాగే వ్యాధి వ్యాప్తికి గల కారణాలపై ప్రపంచ ఆరోగ్య సంస్థతో నిర్ధారణ చేయిస్తామన్నారు. ముందస్తుగా రూడకోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సిబ్బంది అప్రమత్తమై బాధిత చిన్నారులను సకాలంలో తరలించి వైద్య సేవలు అందించారని తెలిపారు. ఇప్పటికే బాధిత గ్రామాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు కొనసాగుతుండగా, రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ డైరెక్టర్ పద్మావతి, రాష్ట్ర స్థాయి వైద్య బృందం పర్యటించిందన్నారు. ఈ సందర్భంగా ప్రస్తుతం ఆస్పత్రిలో ఉన్న వారి స్థితిగతులు, అందుతున్న వైద్య సేవలపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విశ్వామిత్రను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, టీడీపీ నేతలు పాండురంగస్వామి, సాగర సుబ్బారావు, కొండబాబు, నాగేశ్వరరావు, బుక్కా జగదీశ్, మహేశ్వరి, జి.మురళి, అచ్చిబాబు, మహేశ్వరి, తదితరులు పాల్గొన్నారు.

గోవాడ షుగర్స్‌కు రూ.86 లక్షల బకాయిలు విడుదల

» జనసేన ఇన్‌చార్జి రాజు

చోడవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీకి ఏపీ ట్రాన్స్‌కో రూ.86 లక్షల బకాయిలు విడుదల చేసిందని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎస్ఎన్ రాజు తెలిపారు. ట్రాన్స్‌కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ కీర్తి చేకూరిని బుధవారం కలిసి ఫ్యాక్టరీ పరిస్థితి వివరించి బకాయిలు విడుదల చేయాలని కోరగా, ఆమె సానుకూలంగా స్పందించారన్నారు.

డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా

చోడవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ సంస్థ, స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో బుధవారం జాబ్‌మేళా నిర్వహించారు. మెడ్‌ప్లస్, టీజాయ్, నవత కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించి అభ్యర్థులను ఎంపిక చేశాయి. ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, స్కిల్ హబ్ కోఆర్డినేటర్ అప్పలనాయుడు, ప్లేస్‌మెంట్ అధికారి రితీశ్, ఎస్ఎస్ఎస్ పీవోలు మాల్యాద్రి, రత్నభారతి పాల్గొన్నారు.

దారిద్ర్యం వదిలేసింది..!


నాడు: గుంతలతో ఉన్న ఘాట్ జంక్షన్-మాడుగుల రోడ్డు (ఫైల్)

మాడుగుల గుంతల రోడ్డుకు మోక్షం
రూ.15 లక్షలతో తారు రోడ్డు నిర్మాణం
మండల కేంద్రంలో ప్రజల ఆనందం
కూటమి ప్రభుత్వం చొరవపై హర్షం


నేడు: తారు రోడ్డు నిర్మాణంతో సుందరంగా ఉన్న మాడుగుల మార్గం

మాడుగుల రూరల్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లు వైసీపీ ప్రభుత్వం గాలికొదిలేసిన గుంతల రోడ్డుకు మోక్షం లభించింది. ఘాట్ జంక్షన్ నుంచి మాడుగులకు వరకు దారుణంగా తయారైన ఈ రహ'దారి'కి కూటమి ప్రభుత్వం ఓ రూపు తీసుకువచ్చింది. వర్షాలు కురిస్తే అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితి నుంచి బహు సుందరంగా మార్చేసింది. ఈ విషయంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి కృషి ఫలించింది.

ఘాట్‌రోడ్డు జంక్షన్ నుంచి మాడుగులకు వచ్చే రూటును ఆర్అండ్‌బీ అధికారులు రూ.15 లక్షలతో గుంతలు మొత్తం పూడ్చేసి కొత్తగా తారురోడ్డు నిర్మించారు. ఇప్పుడు ఈ తారు రోడ్డును చూస్తున్న మండల కేంద్రంలోని ప్రజలు కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఎనిమిది నెలల్లోనే మాడుగుల 'దారి'ద్ర్యం వదిలేసింది ముచ్చట పడుతున్నారు. అలాగే మాడుగుల గుంతల రోడ్డుకు ఎట్టకేలకు మోక్షం లభించడంతో కూటమి ప్రభుత్వ చొరవపై ప్రయాణికులు, వాహనదారులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పెద్ద చెరువును పరిశీలిస్తున్న స్పీకర్ అయ్యన్నపాత్రుడు, అధికారులు

ట్యాంక్ బండ్ పనులు పూర్తిచేయండి

» స్పీకర్ అయ్యన్నపాత్రుడు

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ట్యాంక్ బండ్ అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తిచేయాలని స్పీకర్ సీహెచ్.అయ్యన్నపాత్రుడు ఆదేశాలు జారీ చేశారు. క్యాంప్ కార్యాలయంలో పర్యాటక శాఖ, ఆర్అండ్‌బీ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్యాంక్ బండ్ పనుల ప్రతిపాదనలను అధికారులు వివరించారు. అనంతరం అధికారులతో కలిసి పెద్ద చెరువు ప్రాంతాన్ని స్పీకర్ పరిశీలించారు. పార్కింగ్, జాతీయ నాయకుల విగ్రహాలు, మరుగుదొడ్ల నిర్మాణాలపై సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ విద్యాసాగర్, ఏఈ నారాయణరెడ్డి, పర్యాటక శాఖ ఈఈ రమణ, డీఈఈ స్వామి, ఏఈ సీతారాం తదితరులు పాల్గొన్నారు.

స్పీకర్‌ను కలిసిన డీఎస్పీ శ్రీనివాస్


స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో డీఎస్పీ శ్రీనివాస్

నర్సీపట్నం: ఇటీవల బాధ్యతలు చేపట్టిన డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాస్ బుధవారం స్పీకర్ అయ్యన్నపాత్రుడును మర్యాదపూర్వంగా కలిశారు. ఈ సందర్భంగా గంజాయి రవాణా అరికట్టాలని, ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని స్పీకర్ సూచించారు. గంజాయి కేసుల్లో సీజ్ చేసిన వాహనాలు నర్సీపట్నం-చింతపల్లి రోడ్డుకిరువైపులా ఉంచడంతో ట్రాఫిక్ సమస్య తలెత్తుతున్నదని, వాటిని తొలగించాలని ఆదేశించారు. స్పీకర్‌ను కలిసిన వారిలో పట్టణ, రూరల్ సీఐలు గోవిందరావు, రేవతమ్మ ఉన్నారు.

విద్యాభివృద్ధికి మరింత కృషిచేయాలి: ఎమ్మెల్యే


వెంకటలక్ష్మిని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బండారు

చీడికాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో విద్యార్థుల విద్యాభ్యాసానికి మరింత కృషిచేయాలని ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి సూచించారు. మంచాల మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మికి జాతీయ స్థాయి అవార్డుతో పాటు రిపబ్లిక్‌డే సందర్భంగా గవర్నర్ కార్యాలయం నుంచి విందుకు కూడా ఆహ్వానం రావడంతో ఎమ్మెల్యే హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు తన క్యాంపు కార్యాలయంలో బుధవారం ప్రిన్సిపాల్‌ను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభ్యాసంలో మరింత శ్రద్ధ చూపాలని, మోడల్ స్కూల్ ఉన్నత స్థితికి తీసుకు వెళ్లాలని ఆయన సూచించారు.

రహదారులపై చెత్త తొలగింపు

'ఆంధ్రజ్యోతి' ఎఫెక్ట్


ఎక్స్‌కవేటర్‌తో చెత్తను తొలగిస్తున్న దృశ్యం

మాకవరపాలెం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎట్టకేలకు రోడ్లపై చెత్తను తొలగించారు. లచ్చన్నపాలెం, మాకవరపాలెం రోడ్లపై చెత్త పేరుకుపోవడంపై 'ఇదేనా చె(తి)త్త శుద్ధి' అనే శీర్షికన బుధవారం ప్రచురించిన కథనానికి అధికారులు స్పందించారు. ఎంపీడీవో సీతామహాలక్ష్మి లచ్చన్నపాలెం వెళ్లి చెత్తను ట్రాక్టర్ల సాయంతో తొలగించారు. అలాగే రోడ్లపై చెత్త పోగులు వేస్తే చర్యలు తీసుకుంటామని కార్యదర్శి రాజారావుకు సూచించారు. అలాగే మాకవరపాలెం సంత మార్కెట్‌కు ఆనుకొని ఉన్న చెత్తను తొలగించారు. అక్కడ చెత్త వేస్తే రూ.500 ఫైన్ వేయాలని ఈవో బాలదొరకు సూచించారు.

నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీల విడుదల

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): నోబుల్ టీచర్స్ అసోసియేషన్ డైరీలను స్పీకర్ అయ్యన్నపాత్రుడు బుధవారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో అస్తవ్యస్తమైన వ్యవస్థలను దారికి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తున్నదన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు తుంపాల వెంకటరమణ, నక్కా శ్రీనిబాబు, శ్రీనివాసులనాయుడు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థినులకు రూ.1.5 లక్షల ఆర్థిక సాయం

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఎంబీఎస్, బీటెక్ చదువుల కోసం నిరుపేద కుటుంబానికి చెందిన ఇద్దరు విద్యార్థినులకు ఎన్ఆర్ఐ వాసవీ క్లబ్ నుంచి రూ.1.5 లక్షలు ఆర్థిక సహాయం మంజూరైంది. పట్టణానికి చెందిన ఎంబీబీఎస్ విద్యార్థిని పెనుగొండ మహాశేతకు రూ.75 వేలు, బీటెక్ విద్యార్థిని దంగేటి శర్వాణికి రూ.76,500 చొప్పున డీఎస్పీ పోతురెడ్డి శ్రీనివాస్ అందించారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు వెలగా నారాయణరావు, సుతాపల్లి శ్రావణ్, పెదిరెడ్ల చింతు తదితరులు పాల్గొన్నారు.

అక్విడెక్ట్ మరమ్మతుకు ప్రతిపాదన: తాండవ చైర్మన్

నాతవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గొలుగొండపేట వద్ద ఏలేరు కాలువపై రాతి అక్విడెక్ట్ మరమ్మతుకు రూ.30 లక్షలతో ప్రతిపాదనలు పంపామని తాండవ ప్రాజెక్టు కమిటీ చైర్మన్ కరక సత్యనారాయణ తెలిపారు. బుధవారం తాండవ ఈఈ బాలసూర్యం, డీఈ అనురాధతో కలసి అక్విడెక్టును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండేళ్లుగా అక్విడెక్ట్ లీకవుతూ తాండవ సాగునీరు ఏలేరు కాలువలో వృథాగా పోతోందన్నారు. రైతుల వినతి మేరకు అక్విడెక్ట్ మరమ్మతుల కోసం ప్రతిపాదనలు పంపామన్నారు. అనంతరం పికెగూడెం సమీపంలోని తాండవ కుడి కాలువ వద్ద దెబ్బతిన్న అక్విడెక్టును పరిశీలించారు. తాండవ ఏఈలు కె.రవి, శ్యామ్‌కుమార్, దుర్గబాబు తదితరులు పాల్గొన్నారు.

వాడీవేడిగా మునిసిపల్ కౌన్సిల్ సమావేశం

చీపుర్లకు రూ.16 లక్షలు చెల్లించడం అన్యాయం: వైస్ చైర్మన్ రామకృష్ణ

దోచుకోవడం, దాచుకోవమే తప్పితే వైసీపీ హయాంలో చేసేదేమీ లేదు కౌన్సిలర్ పద్మావతి


టీడీపీ కౌన్సిలర్లు, వైస్ చైర్మన్ రామకృష్ణ వాగ్వాదం

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పురపాలక బడ్జెట్ సమావేశం వాడీవేడిగా జరిగింది. చైర్‌పర్సన్ బోడపాటి సుబ్బలక్ష్మి అధ్యక్షతన బుధవారం జరిగిన సమావేశంలో ముందుగా కమిషనర్ సురేంద్ర బడ్జెట్ వివరాలు తెలిపారు. అనంతరం 32 అంశాలతో తయారు చేసిన అజెండాను సీనియర్ అసిస్టెంట్ వెంకటలక్ష్మి చదివి వినిపించారు. ఈ సందర్భంగా వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ పారిశుధ్య విభాగానికి సంబంధించిన చీపుర్లు, సున్నం, కత్తులు, కాలువ పారలు, సిల్వర్ బిన్స్‌ను రూ.16 లక్షల సి.బిల్లులతో ఎలా చేస్తారని నిలదీశారు. శానిటరీ ఇన్ స్పెక్టర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కమిషనర్ సురేంద్ర సమాధానం చెప్పడానికి ప్రయత్నించగా వైస్ చైర్మన్ అభ్యంతరం తెలిపారు. కమిషనర్ సమాధానం చెబుతుంటే అడ్డుకోవడం సరికాదని టీడీపీ కౌన్సిలర్లు చింతకాయ పద్మావతి, రాజేశ్, ధనిమిరెడ్డి మధు అన్నారు. దీంతో ఇరువురి మధ్య వాగ్వాదం జరిగింది. కౌన్సిల్ పద్మావతి మాట్లాడుతూ సీఎం చంద్రబాబు, మునిసిపల్ మంత్రి నారాయణ, స్పీకర్ అయ్యన్నపాత్రుడు కృషితో వీఎంఆర్డీ రూ.4.11 కోట్లు, 15వ ఆర్థిక సంఘం నుంచి రూ.7.5 కోట్లు మంజూరయ్యాయన్నారు. అభివృద్ధి పనులకు పార్టీలకు అతీతంగా సహకరించాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో దోచుకోవడం, దాచుకోవడం తప్పితే ఎటువంటి అభివృద్ధి పనులు జరగలేదని విమర్శించారు. మునిసిపాలిటీలో రెండు వేల వీధి దీపాలు పనిచేయని పరిస్థితి ఉంటేదని విమర్శించారు. వాటి స్థానంలో కొత్త దీపాలు అమర్చి సమస్య లేకుండా పరిష్కరించామని పేర్కొన్నారు. వైసీపీ కౌన్సిలర్ కోనేటి రామకృష్ణ మాట్లాడుతూ వీఎంఆర్డీ నిధులతో లింగాపురం అప్రోజ్ రోడ్డు వేసే గిరిజనులకు ఉపయోగంగా ఉండేదన్నారు. లింగాపురం అప్రోచ్ రోడ్డు నిర్మాణం కోసం వైసీపీ ప్రభుత్వంలో రూ.10 లక్షలతో భూ సేకరణ చేశామన్నారు. 25వ వార్డు కౌన్సిలర్ రాజేశ్ మాట్లాడుతూ లింగాపురం 20వ వార్డులో ఐదు నెలల కాలంలో రూ.25 లక్షలు కేటాయించామన్నారు.

వైసీపీ కౌన్సిలర్ల బాయ్‌కాట్

సమావేశంలో కౌన్సిలర్ల మధ్య వాగ్వాదం జరుగుతున్న సమయంలో టీడీపీ కౌన్సిలర్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ భోజనాలు సమయమయ్యే వరకు సమావేశాన్ని సాగదీస్తున్నారని వైసీపీ కౌన్సిలర్లను ఉద్దేశించి కామెంట్ చేశారు. దీంతో 11వ వార్డు వైసీపీ కౌన్సిలర్ బేతిరెడ్డి రత్నం అభ్యంతరం వ్యక్తం చేశారు. టీడీపీ కౌన్సిలర్ మధు నోటికొచ్చినట్టు మాట్లాడుతున్నారని విమర్శించారు. భోజనాల కోసం కౌన్సిలర్ సమావేశానికి రాలేదన్నారు. తర్వాత వైసీపీ కౌన్సిలర్లు బాయ్‌కాట్ చేసి భోజనాలు చేయకుండా వెళ్లిపోయారు.

గోవాడ షుగర్స్ క్రషింగ్ పునఃప్రారంభం

అంతరాయం లేకుండా నడిపించాలని చెరకు రైతు సంఘం డిమాండ్


క్రషింగ్ అంతరాయాలతో ప్రధాన రహదారికిరువైపులా నిలిచిపోయిన చెరకు బళ్లు

చోడవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో బాయిలర్ హౌస్‌లో తలెత్తిన అంతరాయాలతో మంగళవారం ఉదయం నుంచి నిలిచిపోయిన క్రషింగ్, తిరిగి బుధవారం ఉదయం 7 గంటల సమయంలో ప్రారంభమైంది. నాలుగు రోజులుగా వరుస అవాంతరాలతో క్రషింగ్ ఆగుతూ నడుస్తూ సాగుతోంది. ఇప్పటికే ఫ్యాక్టరీ ఆవరణ పూర్తిగా చెరకుబళ్లతో నిండిపోయింది. యార్డులో వాహనాలు నిలిపే అవకాశం లేకపోవడంతో ప్రధాన రహదారికి రెండు వైపులా నిలిపివేశారు. మరికొన్ని వాహనాలు వెంకన్నపాలెం రోడ్డులో యార్డు వద్ద నిలిపి ఉంచారు. ఒక పక్క క్రషింగ్ మందకొడిగా సాగుతుండడం, మరోవంక యార్డులో చెరకు బళ్ల పెరిగిపోతుండడంతో ఫ్యాక్టరీ ఫీల్డు సిబ్బంది ఫ్యాక్టరీకి చెరకు తీసుకుని రావద్దంటూ సమాచారం ఇచ్చినట్టు తెలిసింది. యార్డులో బళ్ల క్లియర్ అయిన తరువాతే చెరకు తీసుకు రావాలంటూ చెప్పడంతో రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

అంతరాయం లేకుండా కొనసాగించాలి: చెరకు రైతు సంఘం

గోవాడ షుగర్ ఫ్యాక్టరీలో చెరకు క్రషింగ్ అంతరాయం లేకుండా కొనసాగించడానికి చర్యలు తీసుకోవాలని ఏపీ చెరకు రైతుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కర్రి అప్పారావు డిమాండ్ చేశారు. బుధవారం గోవాడ ఫ్యాక్టరీని సందర్శించి రైతులతో మాట్లాడారు. ఫ్యాక్టరీలో బగాస్ నిల్వలు తగినంత లేకపోవడం, ఇతర సాంకేతిక సమస్యల వల్ల రైతులు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. చెరకు రైతుల బకాయిలు చెల్లించడంతో పాటు ఫ్యాక్టరీ సక్రమంగా నడిచేలా ఎండీ చర్యలు చేపట్టాలని విన్నవించారు.

మందకృష్ణకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

చోడవరం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారంతో మాదిగలకు మంచి గుర్తింపు లభించినట్టయిందని ఎమ్మార్పీ ఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎలకా మల్లిబాబు హర్షం వ్యక్తం చేశారు. ఇందిరాకాలనీలో బుధవారం సంబరాలు నిర్వహించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచుకున్నారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7న నిర్వహిస్తున్న లక్ష డప్పులు, వేలగొంతులు కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీ ఎస్ నాయకులు మోర్తా శ్రీనివాసరావు, ఎలుసూరి గాటీలు, కండెల్ల వెంకటరావు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నాగపేరంటాలమ్మ తీర్థం

చీడికాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బైలపూడి గ్రామంలో బుధవారం నాగపేరంటాలమ్మ తీర్థం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, వైసీపీ మండల అధ్యక్షుడు గొల్లవిల్లి రాజబాబుతో పాటు పలువురు భక్తులు ముందుగా పూజలు చేశారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం

చీడికాడ, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యతనివ్వాలని వైద్యాధికారి సునీల్‌కుమార్ సూచించారు. మంచాల పంచాయతీ కార్యాలయంలో బుధవారం వైద్య శిబిరం జరిగింది. 45 మంది రోగులను తనిఖీలు చేసి మందులు అందించారు. శిబిరంలో స్టాఫ్‌నర్సు మొల్లి వరలక్ష్మి, ఏఎన్ఎం ఈశ్వరమ్మ, ఆశ కార్యకర్తలు సేవలు అందించారు.

బాల్య వివాహాలతో అనర్థాలపై అవగాహన

రావికమతం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాలతో అనర్థాలపై ఐసీడీఎస్ కార్యాలయంలో అంగన్‌వాడీలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా బాల పరిరక్షణ ప్రతినిధి లోవరాజు మాట్లాడుతూ, బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలు, బాలికల హక్కులు, సుకన్య సమృద్ధి యోజన, బాలిక సమృద్ధి యోజన తదితర పథకాల గురించి వివరించారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్య వివాహాలపై తల్లులకు అవగాహన కల్పించాలని అంగన్‌వాడీ కార్యకర్తలకు ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ఏసీడీపీవో ఎస్.పుష్పదేవి, సూపర్‌వైజర్లు సరోజ ఇనీ, రాజరాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మొక్కజొన్న, మినుము పంటల పరిశీలన

దేవరాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలపూడి, నాగయ్యపేట పంచాయతీల్లో మొక్కజొన్న, మినుము, వేరుశనగ పంటలను కొండెంపూడి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు చంద్రశేఖర్ ఉమామహేశ్వరరావు, ఏవో ఎల్.వై.కాంతమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలు ఇచ్చారు. మొక్కజొన్నలో కాండం తొలిచే పురుగు గమనించి క్వినాల్‌ఫాస్ మందును ఒక లీటరు నీటికి రెండు మిల్లీ లీటర్లు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మినుములో బూడిద తెగులు, ఆకుముడత తెగుళ్ల నివారణ చర్యలకు వారు సూచించారు.

అర్జీలను ఫిబ్రవరిలోగా పరిష్కరించండి: ఆర్డీవో


రెవెన్యూ కార్యాలయంలో సమీక్షిస్తున్న ఆర్డీవో రమణ

రావికమతం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను వచ్చే నెలాఖరులోగా పరిష్కరించాలని నర్సీపట్నం ఆర్డీవో వీవీ.రమణ ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్షించారు. మండల పరిధిలో రెవిన్యూ సదస్సులు, రీ సర్వే సభల ద్వారా వచ్చిన ఫిర్యాదులపై ఆరా తీశారు. సర్వేలో 19 గ్రామాల నుంచి 17672 అర్జీలు రాగా, వాటిలో 1725 పరిష్కరించామని తహసీల్దార్ బి.వెంకటరమణ వివరించారు. మరో 35 అర్జీలు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. అలాగే రెవెన్యూ సదస్సులో వచ్చిన 111 అర్జీలలో 60 పరిష్కరించగా 50 పెండింగ్‌లో ఉన్నాయని చెప్పారు. వీటిని ఫిబ్రవరి నెలాఖరులోగా పరిష్కరించాలని ఆర్డీవో ఆదేశించారు. ఏ అర్జీనైనా సత్వరమే పరిష్కరించాలని సూచించారు.

పీఏసీఎస్‌లో అవకతవకలపై విచారణ


రికార్డులను తనిఖీ చేస్తున్న అసిస్టెంట్ రిజిస్ట్రార్

రోలుగుంట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జానకీరాంపురం పీఏసీఎస్‌లో జరిగిన అవకతవకలపై జిల్లా కలెక్టర్‌కు స్పందనలో చేసిన ఫిర్యాదు మేరకు బుధవారం సొసైటీలో ఆ శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్ డి.శ్రీనివాసరావు విచారణ చేపట్టారు. ఫిర్యాదుదారులైన సొసైటీ సభ్యులు కిల్లాడ సాంభమూర్తినాయుడు, గొల్లు నారాయణరావు, కిల్లాడ అప్పల సీతయ్యనాయుడు సమక్షంలోనే విచారణ చేపట్టారు. గతంలో రెండు మార్లు విచారణ చేసి రుజువు చేసిన రూ.35,49,953 లక్షల నిధులను సీఈవో, ఇతర సిబ్బంది నుంచి రికవరీ చేయాలని ఆదేశాలు జారీ చేసినా, నేటికీ ఎటువంటి రికవరీ లేదని, చర్యలు తీసుకోవాలని విచారణ అధికారి దృష్టికి తీసుకువచ్చారు. అలాగే ఎటువంటి భూమి లేకపోయినా కుసర్లపూడి గ్రామానికి చెందిన గొల్లు కల్యన పేరు మీద తప్పుడు ధ్రువపత్రాలు సృష్టించి తీసుకున్నట్టు చూపిస్తున్నారని, సదరు వ్యక్తికి నేటికీ భూమి లేదని ఫిర్యాదుదారులు స్పష్టం చేశారు. ఈ సొసైటీలో 200 మందికి పైగా బినామీల పేర్లపై రుణాలు, నకిలీ ధ్రువీకరణ పత్రాలతో రుణాలు పొందారని, తద్వారా రూ.కోటికి పైగా సొసైటీ నిధులు స్వాహా చేశారని తెలిపారు. సమగ్ర విచారణ చేపట్టి నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని విచారణ అధికారి తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది కృష్ణ, దేముడు పాల్గొన్నారు.

ఉపాధి రోజు కూలి రూ.300 వచ్చేలా చూడండి

» ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ మణికుమార్


మేట్‌ల శిక్షణ శిబిరంలో మాట్లాడుతున్న ఏపీడీ

రావికమతం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలకు రోజు వేతన రూ.300 గిట్టుబాటు అయ్యేలా మేట్‌లు చర్యలు తీసుకోవాలని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీడీ జె.మణికుమార్ సూచించారు. గుడివాడ గ్రామ పంచాయతీ పరిధిలోని ఉపాధి మేట్‌లకు బుధవారం పథకం పనులపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాలలో ఉపాధి పనులు భూగర్భ జలాలు పెంచే విధంగా, రైతులకు దోహదపడేలా చేపట్టాలని సూచించారు. మండలంలో ఈ ఏడాది రూ.4.5 కోట్ల విలువైన ఉపాధి పనులు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఏ గ్రామంలో పనులు లేవన్న మాట వినిపించకూడదని స్పష్టం చేశారు. ముందుగానే పనులు గుర్తించాలని, నిర్దేశిత సమయానికి పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మి, కార్యదర్శి శ్రీనివాస్, ఎపీఏ వెంకటలక్ష్మి పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

మద్యం బెల్టు దుకాణాలపై ప్రత్యేక నిఘా

-రామారావు, ఎక్సైజ్ సీఐ



నాతవరం, గొలుగొండ మండలాల్లో నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేస్తున్నాం. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం. మద్యం బెల్టు దుకాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఎక్కడైనా దుకాణాలు ఉన్నట్టు తమకు సమాచారం వస్తే వెంటనే దాడులు నిర్వహిస్తున్నాం. నాతవరం మండలానికి చెట్టి బలిజ కులస్థులకు ప్రభుత్వం ఒక మద్యం షాపు కేటాయించింది. వచ్చే నెల 5వ తేదీ లోగా వారు దరఖాస్తు చేసుకోవాలి.

ప్రశ్న: మీ పోలీసు స్టేషన్ పరిధిలో ఎన్ని మద్యం దుకాణాలు ఉన్నాయి?

జవాబు: నాతవరం, గొలుగొండ మండలాల్లో ఎనిమిది మద్యం షాపులు ఏర్పాటు చేశాం.

ప్ర: రెండు మండలాల్లో నాటుసారా తయారీపై మీరు ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: రెండు మండలాల్లో తమ సిబ్బందితో నిరంతరం పెట్రోలింగ్ చేపడుతున్నాం. నాటుసారా తయారీ బట్టీలపై దాడులు చేస్తున్నాం. సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తున్నాం.

ప్ర: మద్యం బెల్టు దుకాణాలపై మీ చర్యలు ఏమిటి?

జ: మద్యం బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్నట్టు తమకు సమాచారం అందిన వెంటనే స్పందిస్తున్నాం. తక్షణమే దాడులు నిర్వహిస్తున్నాం. ప్రస్తుతం మద్యం బెల్టు దుకాణాలు తగ్గాయి. దీనిపై నిరంతరం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం.

ప్ర: గొలుగొండ స్టేషన్ పరిధిలో చెట్టి బలిజిలకు షాపు కేటాయించారా?

జ: మా పరిధిలోని నాతవరం మండలానికి ఒక దుకాణాన్ని ప్రభుత్వం కేటాయించింది. జిల్లాలో ఈ షాపు నిర్వహణకు చెట్టిబలిజి కులస్థులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకోవాలి. వచ్చే నెల 5వ తేదీలోగా దరఖాస్తులు అందించాలి.

ప్ర: మీ పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉందా..?

జ: పోలీసు స్టేషన్‌లో సిబ్బంది కొరత ఉంది. దీనిపై ప్రభుత్వానికి నివేదిక అందించాం.

-గొలుగొండ, ఆంధ్రజ్యోతి

వాకర్స్ క్లబ్ స్టీల్ బ్యాంకు ప్రారంభించిన కమిషనర్

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణలో భాగంగా వాకర్స్ క్లబ్ స్టీల్ బ్యాంకు ఏర్పాటు చేయడం అభినందనీయమని మునిసిపల్ కమిషనర్ సురేంద్ర పేర్కొన్నారు. ఎన్టీఆర్ మినీ స్టేడియంలో బుధవారం స్టీల్ బ్యాంకు ప్రారంభించారు. క్లబ్ కార్యదర్శి కె.సత్యనారాయణకు స్టీల్ సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చాలా ఏళ్లుగా ప్లాస్టిక్ నిషేధం కోసం క్లబ్ సభ్యులు అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, దానికి కొనసాగింపుగా స్టీల్ సామగ్రి సమకూర్చుకోవడం శుభపరిణామమని చెప్పారు. ఈ కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షుడు స్వామి, ఎంవీ రంగారావు, కోశాధికారి అల్లు అప్పారావు, జాయింట్ సెక్రటరీ పి.శ్రీను, శంకర్‌రెడ్డి, పీఆర్‌టీయూ అధ్యక్షుడు ఎ.వరహాలనాయుడు, పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జాలమ్మ పాల్గొన్నారు.

మెగా జాబ్‌మేళాను వినియోగించుకోండి

దేవరాపల్లి,జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 31న జరగనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువత వినియోగించుకోవాలని టీడీపీ మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ కోరారు. ఎమ్మెల్యే బండారు సత్యనారణమూర్తి సహకారంతో ఈ మేళా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. ముందుగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

ఏఎల్‌పురంలో పారిశుధ్య పనులు

కృష్ణాదేవిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మేజర్ పంచాయతీ ఏఎల్‌పురంలో బుధవారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈవోపీఆర్‌డీ కె.శ్రీనివాసరావు, సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో బీసీ కాలనీ, గొల్లవీధి, ఎస్సీ కాలనీలో పూడికతీత పనులు చేయిస్తున్నారు. దీంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

ఉపాధి పనులపై గ్రామసభ

కృష్ణాదేవిపేట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లింగందొరపాలెం పంచాయతీలో బుధవారం ఉపాధి పనులపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్పీ వరప్రసాద్ మాట్లాడుతూ ఉపాధి పనులపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్నామని, అవకతవకలు జరిగితే అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. ఐసీడీఎస్ పీవో శ్రీగౌరీ, పంచాయతీ కార్యదర్శి నాగవెంకటశివ, మాజీ సర్పంచ్ గెడ్డం సత్యనారాయణ, నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటుచేయాలి

మాడుగుల రూరల్: కేజేపురం జంక్షన్‌లో డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని ఎంపీటీసీ సభ్యులు బీశెట్టి శ్రీనివాసరావు కోరారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కేజేపురం నుంచి దబ్బగుంట రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టి సమస్య పరిష్కరించినట్టు చెప్పారు. అలాగే కేజేపురంలోనూ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేయాలని కోరారు.

బరిలో ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు

» మరోసారి పోటీ చేయనున్న సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ

» పీడీఎఫ్ మద్దతుతో కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ మద్దతుతో శ్రీనివాసులునాయుడు పోటీ

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో దిగేందుకు పలువురు సిద్ధమవుతున్నారు. సిట్టింగ్ ఎమ్మెల్సీ రఘువర్మ మరోసారి పోటీ చేయనున్నారు. ఆయనకు రాష్ట్ర స్థాయిలో ఏపీటీఎఫ్, ప్రధానోపాధ్యాయల సంఘం ఇప్పటికే మద్దతు పలికాయి. పీడీఎఫ్ తరఫున కోరెడ్ల విజయగౌరి, పీఆర్‌టీయూ నుంచి మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులునాయుడు పేర్లను ఆయా సంఘాలు ఇప్పటికే ప్రకటించాయి. శ్రీనివాసులునాయుడుకు ఆంధ్రప్రదేశ్ టీచర్స్ అసోసియేషన్ (అపస్) మద్దతు ప్రకటించింది. కాగా 2019 ఎన్నికల్లో ఫ్యాప్టో తరఫున రఘువర్మ పోటీ చేసి విజయం సాధించారు. ఫ్యాప్టోలో ఉన్న సంఘాలు ఇప్పుడు కలిసి ఒకే అభ్యర్థికి మద్దతు ఇవ్వడం లేదు. రఘువర్మకు ఏపీటీఎఫ్-257, హెచ్‌ఎం అసోసియేషన్ మాత్రమే ప్రస్తుతానికి మద్దతు ప్రకటించగా, యూటీఎఫ్ ఈ పర్యాయం సీపీఎం అనుబంధంగా ఉన్న పీడీఎఫ్ అభ్యర్థి విజయగౌరికి మద్దతు తెలిపింది. మరో సంఘం ఎస్టీయూ ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు. ఇదిలావుండగా నగరంలో ప్రైవేటు పాఠశాల నిర్వహిస్తున్న వ్యక్తి ఒకరు ఎన్నికల్లో పోటీ చేయాలని భావిస్తున్నట్టు తెలిసింది. అలాగే విశాఖ జిల్లా ఇంటర్ బోర్డు మాజీ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి ఆర్.సత్యనారాయణ, ఆనందపురం మాజీ ఎంఈవో పద్మావతిలు నెల రోజుల నుంచి ఉత్తరాంధ్రలో పర్యటిస్తున్నారు. కాగా రాష్ట్రంలో అధికారంలో ఉన్న కూటమి పార్టీలు ఎవరికి మద్దతు పలుతాయనేది ఇంకా ప్రకటించలేదు. కూటమికి చెందిన ఒక ఎమ్మెల్సీ, మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్సీలు మాత్రం రఘువర్మకు అనుకూలంగా ఉన్నారు. అయితే టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో తటస్థంగా ఉండాలని ఉత్తరాంధ్రకు చెందిన కూటమి నేతలు కొందరు అభిప్రాయపడుతున్నారు. ఈ విషయం టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు వద్ద ప్రస్తావించగా మద్దతుపై ఇంకా నిర్ణయం తీసుకోలేదన్నారు. విపక్ష పార్టీ వైసీపీకి చెందిన ఉపాధ్యాయ సంఘం ఇంకా తన నిర్ణయాన్ని ప్రకటించలేదు.

టీచర్లు టీఐఎస్‌లో డేటా నమోదు చేయాలి: డీఈవో

అనకాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ, మునిసిపల్, మండల పరిషత్, జడ్పీ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టీఐఎస్‌లో తమ సమాచారాన్ని పొందుపరచాలని డీఈవో గిడ్డి అప్పారావునాయుడు ఆదేశించారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాబోయే పదోన్నతులు, బదిలీల నేపథ్యంలో ఆన్‌లైన్‌లో డేటా అప్‌డేట్ చేయాలని ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ అయ్యాయని తెలిపారు. సీఎస్‌సీ వెబ్‌సైట్‌లో టీచర్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ (టీఐఎస్)లో తమ వ్యక్తిగత లాగిన్లలో, డీడీఓ లాగిన్‌లలో సమాచారం పొందుపరచాలన్నారు. గతంలో అప్‌లోడ్ చేసిన సమాచారంలో తప్పులున్నా వాటిని సరిదిద్దుకొనే వెసులుబాటు ఉందని తెలిపారు. సమయం దగ్గరపడుతున్న నేపథ్యంలో ప్రతి ఉపాధ్యాయుడు సరైన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో అప్‌డేట్ చేయాలని సూచించారు.

పరవాడ ఎంపీడీవో తీరుపై కలెక్టర్ అసహనం

... 5వ పేజీ తరువాయి

కావస్తుంది. ఈ నాలుగు నెలల్లో ఎలా వ్యవహరించారన్నది సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. మద్యం మత్తులో విధులకు హాజరై, సిబ్బంది పట్ల దురుసుగా ప్రవర్తించేవారని విచారణలో బయటపడినట్టు తెలిసింది.

రక్త నమూనాలను సేకరించిన డీఎం హెచ్‌ఓ

కలెక్టర్ ఆదేశాల నేపథ్యంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి (డీఎం అండ్ హెచ్‌ఓ) రవికుమార్ సాయంత్రం ఐదు గంటలకు పరవాడ ఒకటి, రెండు సచివాలయాలకు చెందిన ఏఎన్ఎంలతో ఎంపీడీవో కార్యాలయానికి చేరుకున్నారు. ఎంపీడీవో శ్యామ్‌సుందర్ నుంచి రక్త నమూనాలను సేకరించారు. అప్పటికే సీఐ తన సిబ్బందితో ఎంపీడీవోకు బ్రీత్ ఎనలైజర్ పరీక్ష చేసినట్టు తెలిసింది.

అంగరంగ వైభవంగా అప్పన్న తెప్పోత్సవం

» కృష్ణాలంకారంలో పుష్కరిణిలో విహరించిన స్వామి

» వందలాదిగా తరలివచ్చిన భక్తులు



తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

సింహాచలం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): సింహాచలంలోని వరాహలక్ష్మీనృసింహస్వామి తెప్పోత్సవం బుధవారం సాయంత్రం అంగరంగ వైభవంగా జరిగింది. పుష్యమాస బహుళ అమావాస్య సందర్భంగా స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని ఆలయ అలంకారి కరి సీతారామాచార్యులు శిరస్సున నెమలి పింఛం, చేతిలో పిల్లనగ్రోవితో కృష్ణునిగా స్వర్ణాభరణాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. స్వామిని, ఉభయ దేవేరులను పల్లకిలో ఉంచి మెట్లమార్గంలో ఛత్రం, చామరం, మంగళవాయిద్యాలతో కొండదిగువకు తీసుకువచ్చారు. తొలిపావంచా వద్ద దేవస్థానం పర్యవేక్షణాధికారి సత్యవాణి, గ్రామస్థులు స్వామికి ఆహ్వానం పలికారు. తొలిపావంచా నుంచి కళాకారుల కోలాటాలు, సన్నాయి వాయిద్యాల నడుమ వరాహ పుష్కరిణికి ఊరేగింపుగా తీసుకువెళ్లారు. అప్పటికే సిద్ధంగా ఉంచిన హంసాకృతి పుష్పనౌకలో స్వామిని ఉంచి, పుష్కరిణి మధ్యలోని మండపానికి ముమ్మారు ప్రదక్షిణలు చేయించి మండపంలోనికి తీసుకువెళ్లారు. అక్కడ వైదికులు విశ్వక్సేనారాధన, పుణ్యాహవచనములు చేసి షోడశోపచారాలు సమర్పించారు. పండితులు చతుర్వేదాలను పఠించగా, స్థానాచార్యులు ఉత్సవ విశిష్టతను వివరించారు. ఈ సందర్భంగా పుష్కరిణి ఉత్తరగట్టుపై కళ్లు మిరిమిట్లు గొల్పేలా బాణసంచా కాల్చారు. తూర్పున ఏర్పాటుచేసిన ప్రత్యేక వేదికపై సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. రాత్రి కొండదిగువ ప్రధాన మూడు మాడవీధుల్లో సర్వజన మనోరంజని వాహనంపై స్వామికి తిరువీధి నిర్వహించారు. మహిళలు తమ ఇళ్ల ముంగిట రంగవల్లులు తీర్చిదిద్ది, స్వామిని కర్పూర నీరాజనాలతో ఆహ్వానం పలికారు. భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. గోపాలపట్నం సీఐలు గొలగాని అప్పారావు, శ్రీనివాసరావు ఆధ్వర్యంలో బందోబస్తు ఏర్పాటు చేశారు. స్థానాచార్యులు టీపీ రాజగోపాల్ సారథ్యంలో ప్రధానార్చకులు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, ఐవీ రమణాచార్యుల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. ఏఈఓ ఆనందకుమార్, ఈఈ శ్రీనివాసరాజు, రాంబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

రైతులకు గుర్తింపు కార్డులు

» ఫార్మర్ రిజిస్ట్రీలో వివరాలు నమోదు చేసుకోవాలి

» జిల్లా వ్యవసాయ శాఖ అధికారి మోహన్‌రావు



దాలివలసలో రైతులతో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు

కె.కోటపాడు, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్క రైతూ 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో భూమి, ఇతర వివరాలు తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి బి.మోహన్‌రావు చెప్పారు. మండలంలోని దాలివలసలో బుధవారం జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమంలో పాల్గొన్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఫార్మర్ రిజిస్ట్రీని వ్యవసాయ, రెవెన్యూ శాఖలు సంయుక్తంగా నిర్వహిస్తాయని, రిజిస్ట్రేషన్ చేసుకున్న రైతుకు 14 అంకెలుగల ఒక గుర్తింపు కార్డును జారీ చేస్తామని చెప్పారు. 'ఫార్మర్ రిజిస్ట్రీ'లో వివరాల నమోదు కోసం రైతులు సమీపంలోని రైతు సేవా కేంద్రంలో వుండే వ్యవసాయ, ఉద్యాన శాఖ సిబ్బందిని సంప్రదించాలన్నారు. పంటలను ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి తెలుసుకునేందుకు రైతులు తమ ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లలో ఎన్‌పీఎస్ఎస్ (నేషనల్ పెస్ట్ సర్వైలెన్స్ సిస్టం) యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రబీలో వేరుశనగ, నువ్వు, మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు నాణ్యమైన దిగుబడులు సాధించడానికి కాల్షియం, మెగ్నీషియం, గంధకం కలిగిన మిశ్రమ ఎరువును వాడాలన్నారు. పొలంలో ఏళ్ల తరబడి ఒకే పంటను సాగు చేయకుండా కనీసం రెండేళ్లకోసారి పంట మార్పిడి చేయాలని ఆయన సూచించారు. తక్కువ పెట్టుబడితో కచ్చితమైన ఆదాయాన్ని ఇచ్చే ఉలవ, అలసంద, బొబ్బర, చోడి వంటి పంటలు సాగు చేయాలని ఆయన చెప్పారు. అవకాశం వున్నంత మేరకు ప్రకృతి వ్యవసాయంవైపు మళ్లాలని సూచించారు. ఆయన వెంట మండల వ్యవసాయాధికారి సోమశేఖర్, సర్పంచ్ భూమిరెడ్డి దేముళ్లు, ఏఈఓలు లైలా, ప్రియాంక, వ్యవసాయ సిబ్బంది వున్నారు.

నర్సీపట్నంలో పాత నేరస్థుల బీభత్సం

» మూడు బైక్‌లు దహనం, అంబేడ్కర్ విగ్రహం కళ్ల అద్దాలు ధ్వంసం » విద్యుత్ ఉద్యోగులకు కత్తిచూపి బెదిరింపు



నిందితులు దహనం చేసిన బైక్‌లు

నర్సీపట్నం, జనవరి 29 (ఆంధ్ర జ్యోతి): పట్టణంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం రాత్రి పాత నేరస్థులు బీభత్సం సృష్టించారు. రెండు బైక్‌లను దహనం చేశారు. అంబేడ్కర్ విగ్రహం కళ్ల అద్దాలు ధ్వంసం చేసి, విధి నిర్వహణలో ఉన్న విద్యుత్ ఉద్యోగులపై దాడి చేశారు. ఈ సంఘటనలపై అందిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ గోవిందరావు అందించిన వివరాలిలా వున్నాయి.

స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పాత నేరస్థుడు రౌతు మల్లేశ్, అతని ఇద్దరు కుమారులు కరుణాకర్, కుమార్‌లతోపాటు సాయికిరణ్, కేత సాయి, కేత తారక్ మరికొందరు మంగళవారం రాత్రి 11.30 గంటలకు అంబేడ్కర్ విగ్రహం వద్ద మద్యం సేవించారు. అనంతరం విగ్రహం కళ్లద్దాలను ధ్వంసం చేశారు. ఆ సమయంలో అక్కడ ఉన్న గారా దుర్గాప్రసాద్, మర్రా లోవరాజు, మరికొందరు.. దీనిపై రౌతు మల్లేశ్‌ను నిలదీశారు. దీంతో ఇరువర్గాల వారు గొడవ పడ్డారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయంపై అందిన ఫిర్యాదు మేరకు విద్యుత్ శాఖ సిబ్బంది వచ్చి మరమ్మతులు చేస్తున్నారు. మల్లేశ్ వారి వద్దకు వెళ్లి దాడి చేసి, కత్తి చూపించి బెదిరించాడు. దీంతో విద్యుత్ ఉద్యోగులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇద్దరు ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో ఎస్సీ కాలనీకి వెళ్లారు. రౌతు మల్లేశ్, అతని అనుచరులు కర్రలు, కత్తులు పట్టుకొని కేకలు వేస్తూ పారిపోయారు. కాగా అంబేడ్కర్ విగ్రహం కళ్లద్దాలు ధ్వంసం చేసినప్పుడు గారా దుర్గా ప్రదేశ్ ప్రశ్నించడంతో అతని ఇంటి ముందు నిలిపి వుంచిన రెండు బైక్‌లను రౌతు మల్లేశ్, అతని అనుచరులు దహనం చేశారు. ఇంట్లోకి వెళ్లి ఫర్నీచర్‌పై పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. ప్రైవేటు అంబులెన్స్‌లు పార్కింగ్ చేసిన ప్రాంతానికి వెళ్లి అక్కడ వాహనాల అద్దాలు ధ్వంసం చేశారు. బీసీ కాలనీలో ఒక బైక్ మీద పెట్రోల్ పోసి దహనం చేశారు.అందిన ఫిర్యాదుల మేరకు మూడు కేసులు నమోదు చేసి, కాలనీలో బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ గోవిందరావు తెలిపారు. నిందితులను పట్టుకోవడానికి మూడు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని చెప్పారు.

దశ దిశలా ఏటికొప్పాక ఖ్యాతి

... 5వ పేజీ తరువాయి

లభించే అంకుడు చెట్టు కర్రలతో చెవిపోగులు, చొక్కా గుండీలు, చిన్నారుల ఆట వస్తువులు తయారు చేసే వారు. కాలక్రమేణా బొమ్మలకు లక్కను దిద్ది అందంగా తయారు చేయడం మొదలుపెట్టారు. దీంతో లక్క బొమ్మలకు ఆదరణ పెరగడంతో గ్రామంలో మరికొంతమంది ఈ రంగంలోకి దిగారు. ప్రస్తుతం సుమారు 200 కుటుంబాలు బొమ్మల తయారీపై ఆధారపడి జీవిస్తున్నాయి. మారుతున్న కాలానికి, ప్రజల అభిరుచులకు అనుగుణంగా కొత్త కళాఖండాలను తయారు చేస్తున్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరగడం, ఆన్‌లైన్ మార్కెటింగ్ సదుపాయం అందుబాటులోకి రావడంతో ఏటికొప్పాక బొమ్మలకు మరింత ప్రాచుర్యం, తద్వారా ఆదరణ పెరిగాయి. ఒకప్పుడు ఉమ్మడి తెలుగు రాష్ట్రానికే పరిమితమైన ఏటికొప్పాక బొమ్మలు.. అనంతరం రాష్ట్రాన్ని, దేశాన్ని దాటి విదేశాలకు కూడా చేరుతున్నాయి. ఈ క్రమంలో ఇక్కడి కళాకారులను కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు గుర్తించాయి. ఏటికొప్పాకకు చెందిన పెదపాటి శరత్ రాష్ట్రస్థాయి అవార్డు పొందారు. శ్రీశైలపు చిన్నయాచారి 2005లో కోడిగుడ్డును పోలిన ఆకారంలో ఒక కోడిగుడ్డులో 50 కోడిగుడ్లు అమర్చేలా తీర్చిదిద్దిన కళాఖండం ఎంతో ప్రాచుర్యం పొందింది. దీంతో అప్పటి రాష్ట్రపతి అబ్దుల్ కలాం చేతుల మీదుగా అవార్డును స్వీకరించారు. అనంతరం పలు సూక్ష్మకళాఖండాలను తీర్చిదిద్ది అవార్డులు సొంతం చేసుకున్నారు.

ఏటికొప్పాకలో సుమారు 30 ఏళ్ల క్రితం హస్తకళానిలయం ఏర్పాటు చేసి హస్త కళలకు అందిస్తున్న సేవలు, బొమ్మల తయారీలో సహజసిద్ధమైన రంగుల వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నందుకు చింతలపాటి వెంకటపతిరాజును కేంద్ర ప్రభుత్వం గత ఏడాది పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది. తాజాగా ఏటికొప్పాకకు చెందిన గొర్సా సంతోశ్, ఏపీ ఐఅండ్‌పీఆర్ అధికారుల సూచనలతో తయారు చేసిన హస్తకళాఖండాలతో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఢిల్లీలో ఏపీ తరఫున శకటాన్ని ప్రదర్శించారు.

అంతకుముందు ఏటికొప్పాక బొమ్మల విశిష్టత గురించి ప్రధాని మోదీ 'మన్ కీ బాత్'లో ప్రత్యేకంగా ప్రస్తావించారు. దీంతో ఏటికొప్పాక కళాఖండాల గొప్పతనం ప్రపంచ దేశాలతోపాటు మన దేశంలోని మారుమూల గ్రామాలకు కూడా చేరింది. దీంతో ఏటికొప్పాక హస్త కళాకారులు పట్టలేని ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారు. ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ల ప్రోత్సాహమే ఇందుకు కారణమని అంటున్నారు.

ఇళ్ల కాలనీల్లో దొంగలు!

...5వ పేజీ తరువాయి

ఇనుము, ఎనిమిది వేల బస్తాల సిమెంట్, వందలాది టన్నుల ఇసుకను నిల్వ చేశారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న సమయంలో స్థానిక వైసీపీ నాయకుడు ఒకరు కూలీలను ఏర్పాటు చేసుకుని రాత్రి వేళల్లో సుమారు 80 టన్నుల ఇనుము, పెద్ద ఎత్తున సిమెంట్ బస్తాలను అక్రమంగా తరలించుకు పోయి అమ్ముకున్నట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇసుక నిల్వలు కూడా తరిగిపోయాయి. ఈ సమయంలో రొంగలివానిపాలెం గ్రామానికి చెందిన కొంతమంది అనకాపల్లి పోలీసులకు, కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. అప్పట్లో మొక్కుబడిగా కేసు నమోదు చేసి, ఎవరిపైనా చర్యలు చేపట్టలేదు. ఇదే అదనుగా భావించిన వైసీపీ నేతలు మిగిలిన ఇనుము, ఇసుక, సిమెంట్‌ను తరలించుకుపోయారు. తాజాగా కూటమి ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. ఈ విషయం తెలుసుకున్న కొంతమంది వైసీపీ నాయకులు.. కాలనీల్లో మిగిలివున్న ఇనుమును రహస్యంగా తరలించేందుకు రెండు రోజుల కిందట ప్రయత్నించగా గ్రామస్థులు అడ్డుకున్నారు.

మంత్రి లోకేశ్‌కు ఫిర్యాదు

పేదలకు ఇళ్ల నిర్మాణం కోసం కేటాయించిన భవన నిర్మాణ సామగ్రి మాయమవడంపై గ్రామానికి చెందిన కొందరు ఇటీవల మరోసారి ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. ఇటీవల విశాఖ పర్యటనకు వచ్చిన మంత్రి నారా లోకేశ్‌ను స్వయంగా కలిసి పేదల ఇళ్ల నిర్మాణ సామగ్రి అపహరణపై విచారణ జరిపించాలని కోరారు. అదే విధంగా అనకాపల్లి రూరల్ పోలసులకు మరోసారి ఫిర్యాదు చేశారు. సంపతిపురం నుంచి రొంగలివానిపాలెం వరకు వీఎంఆర్‌డీఏ లేఅవుట్‌లలో 2024 జనవరి తరువాత ఇనుము, ఇసుక, సిమెంట్ దొంగలపాలయ్యాయని, దీనిపై సమగ్ర విచారణ జరిపి క్రిమినల్ కేసులు పెట్టాలని కోరారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికకు నగారా

... 5వ పేజీ తరువాయి

అధికారికంగా ప్రకటన చేయాలనుకున్నట్టు సమాచారం. అయితే ఎన్నికల షెడ్యూల్ విడుదలైన నేపథ్యంలో కేంద్ర మంత్రి ఉక్కు కర్మాగారంలో పర్యటించ వచ్చునని, కానీ..హామీలు, అభివృద్ధి పథకాలపై ప్రకటన చేయరాదని అంటున్నారు. అదేవిధంగా ఆంధ్ర వైద్య కళాశాల సెంటినరీ బ్లాక్ ప్రారంభోత్సవానికి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వచ్చే నెల నాలుగో తేదీన రావల్సి ఉంది. ఆ కార్యక్రమం వాయిదా పడింది. సుమారు ఐదు వారాలపాటు ముఖ్యమంత్రి, మంత్రుల అధికార పర్యటనలు ఉండవని అధికారులు తెలిపారు.

క్రైం... crime news

కట్నం వేధింపులకు మహిళ బలి



సుమ (ఫైల్ ఫొటో)

కశింకోట, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం అత్తింటివారు పెడుతున్న వేధింపులు భరించలేక వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని వెదురుపర్తిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు మండలం కాపవరం గ్రామానికి చెందిన మిరియాల సుమ(29)కు, కశింకోట మండలం వెదురుపర్తి గ్రామానికి చెందిన పలివేల కృపాసాగర్ అలియాస్ నాగభూషణంతో 2019లో వివాహమైంది. ప్రస్తుతం వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా అదనపు కట్నం కోసం భర్తతోపాటు అత్త పార్వతి, మామ అప్పారావు, ఆడపడుచు మేరీ కొంతకాలం నుంచి సుమను వేధిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొద్ది రోజుల క్రితం సుమ పుట్టింటికి వెళ్లి, వారం రోజుల క్రితం వెదురుపర్తికి తిరిగి వచ్చింది. అప్పటి నుంచి అత్తింటివారి వేధింపులు మరింత ఎక్కువయ్యాయి. దీంతో తీవ్రమనస్తానికి గురైన సుమ మంగళవారం రాత్రి ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కొద్దిసేపటి తరువాత గమనించిన భర్త, కుటుంబ సభ్యులు కిందకు దించి చూడగా అప్పటికే మృతిచెందింది. ఈ విషయాన్ని సుమ పుట్టింటి వారికి ఫోన్ చేసి చెప్పారు. కానీ స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వలేదు. సుమ తల్లి వెంకయ్యమ్మ రాత్రి పది గంటల సమయంలో కశింకోట పోలీసులకు ఫోన్ చేసి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. సుమ తల్లి, కుటుంబ సభ్యులు బుధవారం ఉదయం వెదురుపర్తి వచ్చారు. కుమార్తె మృతదేహాన్ని చూసి వెంకయ్యమ్మ బోరున విలపించారు. అనంతరం పోలీసు స్టేషన్‌కు వెళ్లి సుమ భర్త, అత్త, మామ, ఆడపడుచులపై ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలాన్ని అనకాపల్లి డీఎస్పీ శ్రావణి, తహసీల్దారు శ్రీనివాసరావు, సీఐ అల్లు స్వామినాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా మృతురాలి తల్లి వెంకయ్యమ్మ మాట్లాడుతూ, అదనపు కట్నం కోసం నిత్యం ఇబ్బందులకు గురి చేయడం వల్లే తన కుమార్తె మృతిచెందిందని ఆరోపించారు.

కట్టుకున్న భార్యను కడతేర్చాడు



మృతిచెందిన వరలక్ష్మి

దేవరాపల్లి, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముషిడిపల్లిలో మద్యానికి బానిసైన ఓ వ్యక్తి కసాయిగా మారాడు. భార్యను వేధించడంతోపాటు తరచూ కొట్టడమే కాకుండా ఏకంగా ఆమె ప్రాణాలు తీశాడు. భార్య మెడకు నైలాన్ తాడు బిగించి హత్య చేశాడు. మంగళవారం రాత్రి జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ మల్లీశ్వరరావు తెలిపిన వివరాలిలా వున్నాయి. విజయనగరం జిల్లా కొత్తవలస మండలం దెందేరు సంతపాలేనికి చెందిన వరలక్ష్మి(38)కి, దేవరాపల్లి మండలం ముషిడిపల్లికి చెందిన బొద్దు నారాయణమూర్తితో 2002లో వివాహం జరిగింది. వీరికి ప్రస్తుతం ఇంటర్ చదువుతున్న కుమారుడు, 9వ తరగతి చదువుతున్న కుమార్తె ఉన్నారు. కుమారుడు పెందుర్తిలోని ఒక కళాశాలలో చదువుతూ రోజూ అమ్మమ్మ వాళ్ల ఇంటి నుంచి రాకపోకలు సాగిస్తున్నాడు. అమ్మాయి భీమిలిలో చదువుతూ అక్కడే హాస్టల్‌లో వుంటున్నది. ప్రస్తుతం ముషిడిపల్లిలో భార్యాభర్తలు మాత్రమే నివాసం వుంటున్నారు. ఈ నేపథ్యంలో మద్యానికి బానిసైన నారాయణమూర్తి.. భార్యను తరచూ వేధిస్తూ చిత్రహింసలకు గురిచేస్తున్నాడు. దీంతో ఇద్దరి మధ్య గొడవలు జరుగుతున్నాయి. పెద్దల సమక్షంలో పంచాయితీపెట్టి మందలించినప్పటికీ అతని ప్రవర్తనలో మార్పు రాలేదు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యాభర్తల మధ్య మరోసారి గొడవ జరిగింది. తరువాత ఇద్దరూ నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి దాటిన తరువాత నారాయణమూర్తి నైలాన్ తాడును వరలక్ష్మి మెడకు బిగించి, ఊపిరాడకుండా చేశాడు. దీంతో ఆమె మృతిచెందింది. బుధవారం ఉదయం సంతపాలెంలో వుంటున్న బావమరిది శ్రీరామమూర్తికి ఫోన్ చేసి, మీ చెల్లి ఎంత పిలిచినా నిద్ర లేవడం లేదని చెప్పాడు. దీంతో అతనితోపాటు కుటుంబ సభ్యులు వెంటనే ముషిడిపల్లి వచ్చారు. తన చెల్లిని భర్తే హత్య చేశాడంటూ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కె.కోటపాడు సీఐ పైడపునాయుడు, స్థానిక ఎస్ఐ మల్లీశ్వరరావు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. నిందితుడు నారాయణమూర్తిని అదుపులోకి తీసుకొని విచారించగా హత్య చేసినట్టు అంగీకరించాడని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించామన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడి మృతి

అనకాపల్లి టౌన్, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిలోని బైపాస్‌రోడ్డు జంక్షన్‌లో బుధవారం మధ్యాహ్నం ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధుడు మృతిచెందాడు. ఈ సంఘటనకు సంబంధించి ట్రాఫిక్ ఎస్ఐ శేఖరం తెలిపిన వివరాలిలా వున్నాయి. నర్సీపట్నానికి చెందిన షేక్ సుభాన్(60) ఇరవై ఏళ్ల క్రితం అనకాపల్లికి వచ్చి జీవనం సాగిస్తున్నాడు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం బైపాస్ రోడ్డులో ఆర్టీసీ బస్సు ముందు నుంచి రోడ్డు దాటుతుండగా ఈ విషయాన్ని ఆర్టీసీ డ్రైవర్ గమనించకపోవడంతో బస్సు ఢీకొంది. దీంతో తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఆర్టీసీ డ్రైవర్ సత్యనారాయణను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్టు ట్రాఫిక్ ఎస్ఐ తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణం

రావికమతం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): రావికమతంలో మంగళవారం రాత్రి వరి నూర్పు యంత్రం బోల్తా పడి ఇద్దరు మృతిచెందిన సంఘటనకు సంబంధించి ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ ఎం.రఘువర్మ తెలిపారు. వి.మాడుగుల మండలం ఒమ్మలి గ్రామానికి చెందిన జొన్నపల్లి రామశివ, రావిలి నవీన్‌కుమార్, టి.దుర్గాప్రసాద్, జొన్నపల్లి గణేశ్, జొన్నపల్లి నాయుడు తదితరులు యంత్రంతో వరి కుప్పలు నూర్చడానికి మంగళవారం ఉదయం మాకవరపాలెం మండలం తామరం వెళ్లారు. అక్కడ పని పూర్తయిన తరువాత రాత్రి పదిన్నర గంటల సమయంలో ఒమ్మలి బయలుదేరారు. రావికమతంలో తట్టబంద కూడలి వద్ద ట్రాక్టర్ మలుపు తిరుగుతుండగా వెనుక వున్న వరి నూర్పు యంత్రం లింకు ఊడిపోయి బోల్తా పడింది. ఈ క్రమంలో గణేశ్, నాయుడు వరి నూర్పు యంత్రం కిందపడిపోయి అక్కడికక్కడే మృతిచెందారు. డ్రైవర్ జొన్నపల్లి రామశివ ట్రాక్టర్‌ను నిర్లక్ష్యంగా, అతివేగంగా నడపడం వల్లనే ప్రమాదం జరిగిందని మృతుడు గణేశ్ భార్య ఉమాదేవి బుధవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ చెప్పారు.

లారీ ఢీకొని మహిళ మృతి

విశాఖపట్నం, జనవరి 29 (ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని ఓ మహిళ మృతి చెందిన సంఘటన దువ్వాడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తుంగ్లాం గ్రామంలో నివాసముంటున్న కింతాడ దేవి (35) భవన నిర్మాణ కార్మికురాలిగా పరిసర ప్రాంతాల్లో పనిచేస్తుంది. బుధవారం రాత్రి పని ముగించుకుని సైకిల్‌పై ఇంటికి వస్తుండగా వెనక నుంచి వస్తున్న లారీ బలంగా ఢీకొనడంతో తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. అనకాపల్లి జిల్లా కశింకోట మండలంలోని బయ్యవరం సమీప జమ్మాదులపాలేనికి చెందిన దేవి 15 ఏళ్ల క్రితం తుంగ్లాం గ్రామానికి చెందిన ఆనందరావును ప్రేమ వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు. కాగా రెండేళ్ల కిందట ఆనందరావు భార్య, పిల్లలను విడిచిపెట్టి ఎక్కడికో వెళ్లిపోయాడు. అప్పటినుంచి దేవి కూలి పనులు చేస్తూ పిల్లలను పోషిస్తుంది. ఇప్పుడు ఆమె మృతి చెందడంతో పిల్లలు అనాథలయ్యారు.

చికెన్ ధరలు	
బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	120.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)	
వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509